ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మార్చి 31, 2026 | సంపుటి - 22 | సంచిక 183 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

### జీవో 317ను వెంటనే

## రద్దు చేయాలి

- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

### వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు

### ట్రాన్స్‌ఫర్ చేయాలి



**హైదరాబాద్,మార్చి30(నినాదం):**

జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆరఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు.

2



### పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి**

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆరఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరారు.

2

### నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

**సింగరేణికి సమంబంధించి పలు సూచనలు చేసిన కాగ్**

### గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ**

2

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశ పెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకో కపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు.





### ఆహార కల్తీని

# నియంత్రిస్తాం

> దేశంలో నియంత నాలన రాకూడదన్నదే నా ఉద్దేశం.. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు : సీఎం రేవంత్..

## ఈగల్, హైడ్రా తరహాలో సరికొత్త వ్యవస్థ తెస్తాం

## నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు

- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

***ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తు న్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.***

**హైదరాబాద్,మార్చి30(నినాదం):**

సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురావమని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతు న్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు.

▸▸తరువాయి2లో..

### ముంచుకొస్తున్న

# మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



**సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డు పెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు.**

**హైదరాబాద్,మార్చి30(నినాదం):**

రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆరఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆ రఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు.

▸▸తరువాయి2లో..

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన**




**వాషింగ్టన్,మార్చి30(నినాదం):**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసు కోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు.

▸▸తరువాయి2లో..




### లొంగిపోయిన మవోయిస్ట్ నారాయణరావు

- వారికి పరిహారం అందిస్తామన్న డిజిపి
- ఎపి నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని ప్రకటన
- మావోయిస్ట్ ఉద్యమం క నుమరుగైందన్న

**అమరావతి, నినాదం:**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు. దాదాపు 36 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నారాయణ సహా మొత్తం 9 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగి పోయారు.

5

### హైదరాబాద్, చెన్నైని మించి

## అమరావతి అభివృద్ధి



- యువత రాజకీయాల్లోకి రావాలి.. టిడిపి అవకాశం ఇస్తుంది
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- సూల్లూరుపేటలో టిడ్కో ఇళ్లను పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు
- ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు
- గత వైసిపిది పనికిమాలిన ప్రభుత్వం అంటూ విమర్శలు

6

### చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

- 8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు
- కోవూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం
- ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల

2

## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

**సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్ బిల్లును వ్యతిరేకించిన బిజెపి**




**హైదరాబాద్,మార్చి30(నినాదం):**

తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠి నమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్ బెయిలబుల్‌గా పరి గణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతో పాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావ తమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రక టనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది.

▸▸తరువాయి2లో..

## సడలని పశ్చిమాసియా ఉద్రిక్తలు

**భారీగా నష్టపోయిన సూచీలు**

**అమెరికాకు స్పెయిన్ షాక్**

**గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ**

2



### పౌర స్వేచ్ఛను

## హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,మార్చి30(నినాదం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుప డ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణిం చారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమ ర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుం దని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధ నలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.

▸▸తరువాయి2లో..

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలోమీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆరఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**హైదరాబాద్, నినాదం:**

ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆరఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆరఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆరఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆరఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆరఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్స్ ద్వారా అక్రమ మైనింగ్?కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆరఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆరఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ`ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎనఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**హైదరాబాద్, నినాదం:**

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు వి టింగులు పెట్టామని...చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటి సారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది.ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ప్లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 'ప్లాట్‌ఫాం స్థాయి కమిటీలు' జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# ఆహార కల్తీ నియంత్రిస్తాం

సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణ భారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆరఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు.




కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో వీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు




దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్ణం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

### పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పద జాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# ములుగు జిల్లాలో ఈదురుగాలుల వర్షం

**చెట్టుకూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ జామ్**

ములుగు, : జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏటూరునాగారం `తాడ్వాయి మధ్య ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. భారీ ఈదురుగాలులతో రహదారులపై చెట్లు పడిపోయాయి. దీంతో కిలోవి టర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జేసీపీ సాయంతో చెట్లను తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసారు. మరో వైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. హైదరాబాద్ తో పాటు జగిత్యాల,కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, ములుగు,నాగర్ కర్నూలు, నల్గొండ,రంగారెడ్డి, సంగారెడ్డి,సిద్దిపేట,వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు,మెరుపులతో తేలికపాటి వర్షానికి చాన్స ఉంది. హైదరాబాద్ లో మార్చి 30న రాత్రి భారీ వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు ,మెరుపులతో కూడిన వర్షం పడుతుందని చెప్పింది. టోలీ చౌకీ, నాంపల్లి,మలక్ పేట, ఆసిఫ్ నగర్, కార్వాన్, గోషామహల్,మెహదీపట్నం, చార్మినార్, అత్తాపూర్ ,మసాబ్ ట్యాంక్,కూకట్ పల్లికి అలర్ట్ జారీ చేసింది. ఖైరతాబాద్,అబిడ్స్ ,సికింద్రాబాద్,ఉప్పల్, ఎల్బీనగర్, చార్మినార్ ,కంటోన్మెంట్ ,కాప్రా,మల్కాజ్ గిరిలో తేలికపాటి మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎసఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎసఎస్ ట్రిపోలిపై ఎఫ్`31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎసఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

## అమెరికాకు స్పెయిన్ షాక్

**గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ**

న్యూఢిల్లీ : అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. 'ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏక పక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది' అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాలో వెల్లడించారు.

## సడలని పశ్చిమాసియా ఉద్రిక్తలు

**భారీగా నష్టపోయిన సూచీలు**

న్యూఢి :పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత ముదరవచ్చన్న భయాల నడుమ సోమవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 1635.67 పాయింట్ల మేర పతనమై 71,947.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 488.20 పాయింట్ల మేర తగ్గి 22,331.40 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా 2.6 శాతం మేర పతనమయ్యాయి. ఆటో, ఎఫఎమసీజీ, టెలికం, రియల్టీ, ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు నేడు 2`4 శాతం మేర నష్టాలను మూటగట్టుకున్నాయి. నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒకానొక దశలో 95.12 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి తాకింది. చివర్లో కాస్త కోలుకుని 94.83 డాలర్ల వద్ద ముగిసింది. చమురు ధరలు మళ్లీ ఆకాశాన్నంటడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కొన్ని రోజుల క్రితం 100 డాలర్ మార్కు దిగువకు చేరిన బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర ప్రస్తుతం 115 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో క్రూడ్ ఆయిల్ ధర 120 డాలర్లకు చేరవచ్చనే అంచనాలు కూడా మార్కెట్ వర్గాలను కలవరపెడుతున్నాయి.

## నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

**మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్**

హైదరాబాద్ :హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

**8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు**

**కోవూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం**

**ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల**

**నెల్లూరు :**

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.



# ఆదాయం గోరంత.. ఖర్చు కొండంత

## రూ.140 కోట్లతో అంచనాలు.. అంకెల గారడీ బడ్జెట్... నగర వాసులకు ప్రయోజనం శూన్యం

### 60 డివిజన్లకు 96 మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకు..?.. పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..!?

### బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం.. కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి30(నినాదం)**
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రూ.140 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని, నగర వాసులకు ఒరిగేదేమీ లేదని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి తీవ్రంగా విమర్శించారు. సోమవారం మేయర్ గణేష్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన బడ్జెట్ సమావేశంపై ఆమె ధ్వజమెత్తారు. కాగితాలకే పరిమితమైన ఈ బడ్జెట్ కార్యరూపం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 107 కోట్ల నిధులు వస్తాయని అంచనా వేస్తూ, 140 కోట్లతో బడ్జెట్ రూపొందించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని విమర్శించారు. ఈ నిధులు ఎలా సమకూరుతాయో స్పష్టత లేకపోవడం బడ్జెట్‌లో పెద్ద లోపమని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో ఆదాయం కేవలం రూ.33కోట్లు ఉందని, ఆదాయం పెంచే విధంగా ప్రణాళిక లేకుండా ప్రభుత్వ నిధులపై అంచనాలతో గారడి చేయడం సరికాదని, మున్సిపల్ ఆదాయ వనరుల్లో కీలకమైన ఆస్తిపన్ను బకాయిలను కనీసం 70 శాతం వసూలు చేసి ఖజానాలో జమ చేస్తేనే గ్రాంట్లు అందే అవకాశం ఉందని గుర్తు చేశారు. అయితే ఈ అంశంలో నిర్లక్ష్యం కారణంగా నగరానికి రావాల్సిన నిధులు కూడా అందకపోతున్నాయని అన్నారు. అలాగే ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానికి సరైన నిధుల కేటాయింపులు లేవని, కోతులు, కుక్కల సమస్యల పరిష్కారానికి సరైన ప్రణాళిక లేదని, కనీసం ఈ ప్రధాన సమస్యపై సమావేశంలో అంశాన్ని కూడా చేర్చలేదని విమర్శించారు. అలాగే సమావేశంలో ప్రవేశపెట్టిన 16, 17, 18, 19 అంశాలు ఎవరికి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. అలాగే సమావేశంలో ప్రవేశపెట్టిన 16, 17, 18, 19 అంశాలు ఎవరికి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు.

**బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం**

మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం వరుసగా మూడు వర్కింగ్ రోజుల్లో మాత్రమే బడ్జెట్ సమావేశం నిర్వహించాలని, కానీ ఒక రోజు ఆదివారం కాగా, సోమవారం వర్కింగ్ డే, మంగళ



వారం మహావీర్ జయంతి సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండగా, సమావేశం ఎలా నిర్వహిస్తారని, ఇది ఖచ్చితంగా నిబంధనలకు విరుద్ధమన్నారు. హడావుడిగా బడ్జెట్ సమావేశం పెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

**పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..?**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ కలిపి 341 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, వారిలో పాల్వంచలో పనిచేస్తున్న 137 మందిలో 133మందికి 20,460 ఇస్తుండగా, కొత్తగూడెంలో 175మంది, సుజాతనగర్‌లో 29మంది పనిచేస్తుండగా, వారికి మాత్రం 19,298 వేతనాలు ఇవ్వడం దేనికి అని ప్రశ్నించారు. వారు అందరూ చేస్తున్న పని ఒక్కటే అయినప్పుడు పాల్వంచ వారికి ఎక్కువ, మిగతా ప్రాంతాల వారికి తక్కువగా ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటో వివరించాలని ప్రశ్నించారు. అదే విధంగా 60 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో 96 మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకని, అదనపు సిబ్బంది పేరిట నిధుల దుర్వినియోగం చేస్తూ ఎవరి ఖాతాలో వేస్తున్నారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్యాలయ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర వ్యయాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్‌లో "సమాన పనికి సమాన వేతనం" అమలు చేస్తే, పాలక ప్రభుత్వాల నుంచి సరైన మద్దతు లేకపోతే ఆర్థిక భారాన్ని తట్టుకోవడం కష్టమని పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ నగర వాసుల ఆశలను నెరవేర్చే విధంగా లేకపోవడం బాధాకరమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా నిధుల వినియోగం జరగాలని కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు.




# జనగణను సమర్ధవంతంగా నిర్వర్తించాలి

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ మార్చి 30 (నినాదం)**
జిల్లాలో నిర్వహించే జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జన గణన 2027 ఫేస్ – 1 గృహాల జాబితా, గృహ గణన (హెచ్ ఎల్ ఓ) నిర్వహణలో భాగంగా, సెన్సెస్ ఫీల్డ్ ట్రేన్నర్స్ కు హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు ఫీల్డ్ ట్రైనర్లకు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి, జిల్లాల కలెక్టర్లు తో శిక్షణ కార్యక్రమాలో, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరము నుంచి అధికారులు తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో జనగణన నాణ్యత క్షేత్రస్థాయి కార్యకర్తలపైనే ఆధారపడి ఉంటుందని వారికి సమర్ధవంతంగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఫీల్డ్ శిక్షణ టీమ్‌లను కోరారు. క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే బాధ్యత వారిపైనే ఉంటుంది కాబట్టి, శిక్షణా మాడ్యూల్‌ను సమర్థవంతంగా అర్థం చేసుకోవాలని జనాభా గణన ప్రక్రియ సమయంలో వారు సజావైన సమన్వయాన్ని కూడా పాటించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు జిల్లాలోని 20 మండలాల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్, అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకు



లుగా తమకు నిర్దేశించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించేలా శిక్షణ తరగతులను అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డులు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కాలనీ, , అపార్ట్మెంట్లు, చిన్నచిన్న వీధి ప్రాంతాల్లో నివసించే ప్రతి ఇంటిని ఇంటిలోని ప్రతి ఒకరి జనగణన విధిగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఏ ఒక్క ప్రాంతం,ఏ ఒక్కరినీ వదలకుండా, డూప్లికేషన్ లేకుండా వంద శాతం కచ్చితత్వంతో పూర్తి చేయడమే తమ లక్ష్యంతో జనగణన చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మారుమూల గిరిజన తండాలు, ఆవాస ప్రాంతాలు హ్యాబిటేషన్లు, గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాలు, జిల్లా స్థాయి వరకు జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వర్తించేలా కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమా లో డిజిటల్ విధానం సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై సవివరంగా వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత, మాస్టర్ ట్రైనర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి చలివేంద్రం ప్రారంభం

## గత 38 సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం కొనసాగింపు.. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కే.బాలరాజ్



**నాగర్ కర్నూల్ మార్చి 30 (నినాదం)**
నాగర్ కర్నూల్ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో గత 38 సంవత్సరాలుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల దాహార్తి వేసవి కాలం లో తీర్చేందుకు సత్యసాయి చలివేంద్రంను సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ ,ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.యాదయ్య లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ బాదం రమేష్ మాట్లాడుతూ సామాజిక సేవలో సత్యసాయి సంస్థలు ముందుంటాయని వారి సేవలను ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడడం హర్షించదగ విషయమని అన్నారు.డిపో మేనేజర్ యాదయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల నుండి ప్రయాణిస్తున్న భక్తులకు వేసవిలో చలివేంద్రం ప్రయాణికుల దాహార్తిని తీరుస్తుందని అన్నారు. సత్యసాయి సేవలు ప్రయాణికులు ఉపయోగకరమని అన్నారు. సత్య సాయి సేవా సమితి కన్వీనర్ కే.బాలరాజ్ మాట్లాడుతూ పట్టణంలోని తొమ్మిది జోన్ల సత్యసాయి భక్తులచే నేటి నుండి జూన్ నెల వరకు ప్రతిరోజు కుండలలో ఉంచిన చల్లని మినరల్ శుద్ధి నీటిని ఉదయం నుండి సాయంత్రం వరకు చలివేంద్రంలో సాయి భక్తులచే ప్రయాణికులకు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు హకిం విశ్వ ప్రసాద్,ట్రస్ట్ కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, పట్టణంలోని సత్యసాయి తొమ్మిది జోన్ల బాధ్యులు, సత్యసాయి యువత, మహిళ,భజన మండలి కన్వీనర్లు,బాల వికాస్ గురువులు సత్యసాయి భక్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి బౌద్ధ స్తూపం అభివృద్ధికి

# కేంద్రం దృష్టి సారించాలి

## లోక్‌సభలో 377 నిబంధన ద్వారా ప్రస్తావించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం, మార్చి 30(నినాదం ):**
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేసి, జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి. సోమవారం లోక్‌సభలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఈ ప్రాచీన వారసత్వ కట్టడాన్ని సంరక్షించేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.



**చారిత్రక ప్రాముఖ్యత ఉన్న స్తూపం..**

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన బౌద్ధ వారసత్వ క్షేత్రంగా నిలిచింది. శాతవాహన, ఇక్ష్వాకు రాజవంశాల కాలంలో (క్రీ.శ. 3–4 శతాబ్దాలు) ఇది వికాసం సాధించినట్లు పురావస్తు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. తవ్వకాలలో మహాస్తూపాలు, విహారాలు, ఇటుక నిర్మాణాలు, బుద్ధ విగ్రహాలు, రోమన్–భారతీయ నాణేలు వెలుగులోకి రావడం దీని ప్రాధాన్యతను మరింత స్పష్టంచేస్తోంది.

**సదుపాయాల కల్పన అవసరం..**

ఇంత ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ స్థలం ఇప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రహదారులు, సూచిక బోర్డులు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలు లేవని, సంరక్షణ లోపంతో నిర్మాణాలు దెబ్బతింటున్నాయని కూడా సూచించారు.

**జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చాలి..**

పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమగ్ర సంరక్షణ చేపట్టాలని, స్థలంలో మ్యూజియం మరియు ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చితే దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ వారసత్వ కట్టడాన్ని పరిరక్షిస్తూ, తెలంగాణలో సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

# ఏసీబీకి పట్టుబడ్డ తిమ్మాజీపేట ఎస్సై

**నాగర్ కర్నూల్ మార్చి 30 (నినాదం)**
అక్రమఇసుక రవాణా ట్రాక్టర్ జెసిబిల విషయంలో 30 వేలు లంచం డిమాండ్ చేసి ఈనెల 7న 20 వేల రూపాయలు తీసుకొని ఏసీబీకి పట్టుబడ్డ తిమ్మాజిపేట ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి. మహబూబ్ నగర్ జిల్లా ఏసీబీ డిఎస్పి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 05 తేదీన అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ జెసిబి లపై తిమ్మాజిపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు 60 వేల రూపాయలు జరిమానా విధించారు. అయితే సదరు వ్యక్తి 60 వేల జరిమానా కట్టి వాహనం రిలీజ్ చేసేందుకు పత్రాలను తెచ్చి ఎస్సై కి ఇచ్చాడు. 30 వేల రూపాయలు ఇస్తేనే వాహనాలను రిలీజ్ చేస్తానని ఎస్ఐ చెప్పడంతో మైనింగ్ అధికారులకు ఫైన్ కట్టి మళ్లీ ఎస్సై కూడా డబ్బులు కట్టాలా అని తీవ్ర ఆవేదనకు గురైన సదరు వ్యక్తి ఎస్సై తనతో మాట్లాడి 30 వేల రూపాయలు డిమాండ్ చేసిన వాయిస్ రికార్డింగ్ లు 20 వేల రూపాయలు చెల్లించిన ఆధారాలతో ఏసీబీ ని ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో. ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్ కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ తెలిపారు.




# ఎండ తీవ్రతల పట్ల జాగ్రత్తలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**గద్వాల బ్యూరో మార్చి 30 (నినాదం)**
జిల్లాలో ఎండ తీవ్రతలు 40 డిగ్రీలు ఉన్నందున వడదెబ్బకు గురి కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎండల తీవ్రతపై వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏ ఒక్కరు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అన్నీ మండలల్లో తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు అంగన్వాడి చిన్నారులకు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని అన్నారు. వసతిగృహాలలో ఉండే విద్యార్థులు ఎండ పూట బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధికారులు కూడా వడదెబ్బకు గురి కాకుండా టోపీలను వినియోగించాలని, తరచుగా నీరు సేవించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలు కూడా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు నిర్వహించాలని అన్నారు. వైద్యాధికారులు అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లు పంపిణి చేయాలన్నారు. పక్షులు, పశువులకు కూడా నీటిని అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసరమైతే తప్పఎండలో బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. తరచుగా తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా ఏప్రిల్ రెండవ తేదీ నుండి నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలలో ప్రజలకు అవగాహన కలిగించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ముద్రించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశం ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి, ఆర్డిఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు కూలి డబ్బులు

# చెల్లించాలంటూ తహసిల్దార్‌కు వినతి

**గద్వాల ప్రతినిధి మార్చి30( నినాదం)**
సోమవారం ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలంటూ ప్రజావాణి కార్యక్రమంలో రాజోలి తహసిల్దార్ రామ్మోహన్ కు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజోళి మండల కేంద్రంలో గత మూడు నెలల పైగా ఉపాధి హామీ కి సంబంధించి పనిచేసిన కూలీలకు డబ్బులు రావడం లేదని అలాగే మూడు నెలల నుంచి ఉపాధి హామీ పనులు అన్ని గ్రామాలలో పని పెట్టడం లేదని అన్నారు.కనుక ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధి హామీ పనులు పెట్టాలంటూ డిమాండ్ చేశారు. పని పెడితే పని చేసుకుంటూ కుటుంబాలను పోషించడం సాధ్యమవుతుందని అనుకుంటే, ఉపాధి పనులు చేసిన డబ్బులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా కనీసం పెండింగ్లో ఉన్నటువంటి ఉపాధి కూలీల డబ్బులు చెల్లిస్తే



ఒక్క పూటైనా గడుస్తుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డును, ఉపాధి పని కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉందని అన్నారు. ఓట్ల కోసం వచ్చిన రాజకీయ నాయకులు ఇవేం పట్టించు కోవడం లేదని అన్నారు. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎంజి రాంజీ పథకాన్ని తీసివేసి యధావిధిగా ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముళ్లదిన్నె మాజీ ఎంపిటిసి పక్కికిరన్న పాదు కూలీలు లవను లక్ష్మన్న మారెన్న పాల్గొన్నారు.




# బాధితులకు తక్షణ సహాయం అందించాలి

## డయల్ 100/112 సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో సీపీ

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 30 (నినాదం)**
డయల్ 100/112 ద్వారా కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవడంలో సమయ పాలన పాటించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డయల్ 100/112 వ్యవస్థ పనితీరును మెరుగుపరిచేందుకు, అందులో ఎదురవుతున్న లోపాలను అధిగమించేందుకు హైదరాబాద్ నుండి వచ్చిన సాంకేతిక నిపుణుల ద్వారా కమిషనరేట్ పరిధిలో నిఎస్.ఐ లకు,సీఐ లకు, డయల్ 100 /112 సిబ్బందికి సోమవారం శిక్షణ ఇప్పించారు. కాల్స్ స్వీకరించడంలో లేదా సమాచారాన్ని క్షేత్రస్థాయి సిబ్బందికి చేరవేయడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసే బాధితులతో ఫోన్ రిసీవ్ చేసుకునే సిబ్బంది ఓపికగా, మర్యాదగా వ్యవహరించాలని, వారి నుండి పూర్తి వివరాలను సేకరించాలని కమిషనర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి, గస్తీ వాహనాల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని సూచించారు. డయల్ 100/112 కాల్స్ స్థితిగతులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) బి.బస్వా రెడ్డి, హైదరాబాద్ నుండి వచ్చిన చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ రాజీవ్ కృష్ణ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరీష్ కృష్ణ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సి టి సి, ఎసిపిలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిసిఆర్ బి ఇన్స్పెక్టర్ అంజయ్య, సిఐలు, ఎస్సైలు, పోలీస్ స్టేషన్ రైటర్స్ డయల్ 100/112 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆహార కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి

**గద్వాల బ్యూరో మార్చి 30 (నినాదం)**
జిల్లాలోని హోటల్స్, రెస్టారెంట్స్, తదితర ఆహార కేంద్రాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పేర్కొన్నారు. సోమవారం ఐడిఓసీ సమావేశపు మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామస్థాయి హోటల్స్ నుండి జిల్లా స్థాయి వరకు సంబంధిత గ్రామపంచాయతీ, ఫుడ్ సేఫ్టీ విభాగం నుంచి హోటల్స్ నిర్వహించేందుకు అనుమతులు, రిజిస్ట్రేషన్, చేసుకోవడం తప్పనిసరి చేయాలన్నారు. జిల్లాలోని హోటల్స్ లో ఆహారాన్ని తయారు చేసేందుకు వినియోగించే నూనెలు, ఇతర సరుకులు నాణ్యతతో ఉన్నాయో లేదో సంబంధిత అధికారులు తరచు పరిశీలించాలన్నారు. ఆహార కేంద్రాల వంట గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అక్కడ వినియోగించే పాత్రలు, నీళ్లు శుభ్రంగా లేకుంటే ఆహారం కల్తీ అయ్యే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. వంట చేసే మాస్టర్లు, ఇతర



సిబ్బంది నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటిస్తూ శుచి, శుభ్రతతో వంటలు చేసేలా ఆదేశించాలన్నారు. ఒక నెలలో హోటల్స్ నుంచి సేకరించిన ఆహార పదార్థాల శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించి రిపోర్టును ఎప్పటికప్పుడు తమకు పంపించాలన్నారు. హోటల్ ల యజమానులు నిబంధనల ప్రకారం ఆయా ఆహార కేంద్రాలను నిర్వహించాలని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయించే యాజమాన్యాలపై కేసులు బుక్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా

# ఎన్. విజయ్ కుమార్

**గద్వాల ప్రతినిధి మార్చి 30 (నినాదం)**
గద్వాల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఎన్. విజయ్ కుమార్ ఘన విజయం సాధించినందుకు మాకెంతో గర్వంగా ఉంది అని బార్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గద్వాల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన ఎం విజయకుమార్ మాట్లాడుతూ నిరంతరం వృత్తి పట్ల నిబద్ధతతో, అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి మరింత ఉత్సాహంతో కృషి చేస్తారని అన్నారు. ఈ నా విజయం నన్ను నమ్మి ఓటు వేసిన ప్రతి ఒక్కరిది అని తెలిపారు. నా విజయానికి సహకరించిన పెద్దలకు, మిత్రులకు,తోటి న్యాయవాదులకు, కృతజ్ఞతలు అని తెలిపారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలి

## ముఖ్య అతిథులుగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

**గద్వాల బ్యూరో మార్చి 30 (నినాదం)**
సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వైయస్సార్ చౌక్ నందు బిఆర్ ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురవ పల్లయ్య ఆధ్వర్యంలో పోరు దీక్ష కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరై,సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు, విద్యార్థులకు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చెయ్యకపోవడం ప్రభుత్వం యొక్క సిగ్గుచేటు అని మండిపడ్డారు... కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం లోపు 2 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, మోసం చేశారని అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 10,000 వేల కోట్లు ఉంటే బడ్జెట్ లో 4 వేల కోట్లే కేటాయింపులు చేసి విద్యార్థులను,కళాశాల యాజమాన్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండపడ్డారు..ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా,జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా మోసం చేస్తుందని అన్నారు.గురుకులాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండగా, కలుషిత ఆహారం తినడం వలన రాష్ట్రంలో ఇప్పటికి 126 మంది విద్యార్థులు చనిపోవడం జరిగింది ఈ మరణాలకు బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ దే అని అన్నారు...ఎస్సి, ఎస్టి విద్యార్థులు 10 వ తరగతి పాస్ అయితే 10,000,ఇంటర్ పాస్ అయితే పదిహేను వేలు, డిగ్రీ పాసైతే 25,000, పిజి పాస్ అయితే లక్ష, పిహెచ్డి పాస్ అయితే ఐదు లక్షలు ఇస్తా అని ప్రభుత్వం మోసం చేసిందన్నారు.6 గ్యారంటీ లకు పంగనామాలు పెట్టిన నయవంచన 420 రేవంత్ రెడ్డి సర్కార్ కు రాబోయే ఎన్నికలు బుద్ధి చెప్పాలని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బి ఆర్ ఎస్ పార్టీ పోరాటం ఆగదు అని ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర్ రెడ్డి,చక్రధర్ రావు, జీ.రాఘవేంద్ర రెడ్డి, సూర్య గౌడ్,కోటేష్,మోనేష్,కౌన్సిలర్లు పులపాటి వెంకటేష్, టి ఎన్ ఆర్ జగదీష్, దుబన్న, చంటన్న, నరసింహులు,చిత్తరి కిరణ్,గువ్వల గోపాల్, మోహన్,కమ్మరి రాము,రామకృష్ణ, నరసింహులు,గంజిపేట రాజు,రంజిత్ కుమార్, గోవిందు, మహేష్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బి ఆర్ ఎస్ వి నాయకులు, నిరుద్యోగులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహించాలి

## కలెక్టర్ అనుదీప్

**ఖమ్మం ప్రతినిధి , మార్చి 30 (నినాదం )**

యాసంగి (రబీ) 2025-26 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పక్కాగా నిర్వహించేం దుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు మాత్రమే కాకుండా రైతులకు చెల్లింపులు జరిగే వరకు అధికారుల బాధ్యత కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొనుగోలు వివరాలు, రైతులకు చెల్లింపుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఐకెపి కేంద్రాల్లో చెల్లింపుల ఆలస్యం లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్ని సంచులను మిల్లర్ల నుంచి పూర్తిగా సేకరించాలని, రవాణా వాహనాలకు






జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అకాల వర్షాల దృష్ట్యా కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, తేమ కొలిచే యంత్రాలు తదితర సదుపాయా లు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.అదనంగా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వచ్చే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... వేసవి తీవ్రత దృష్ట్యా రైతులకు నీడ కల్పించేలా టెంట్లు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్ కవర్లను ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి గన్ని సంచులు, కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. రైతులకు టోకెన్లు జారీ చేసి, గన్ని సంచుల వినియోగాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, మండల ప్రత్యేక అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
ఇంతకుముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923K12010PIC039179,
రిజిస్టర్డ్ ఆఫీస్: 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి దేవాలయం దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567.

డిమాండ్ నోటీసు

భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారిచే జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O. 3466 (E), తేది: 18 డిసెంబర్, 2015తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట సదరు చట్టముగా వ్యవహరించబడును)లోని సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1)లోని క్లాజ్ (m) లో సబ్-క్లాజ్ (iv) పరిధిలో ఆర్థిక సంస్థగా మరియు కంపెనీల చట్టము 1956 క్రింద నమోదైన కంపెనీగా భారత దేశములోని వివిధ ప్రదేశములలో బ్రాంచ్‌లు కలిగి ఉండి మరియు నమోదిత కార్యాలయము 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి దేవాలయం దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567 కలిగిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి అధీకృత అధికారి నివాస యూనిట్ల కొనుగోలు మరియు/లేదా నిర్మాణం కొరకు ముందస్తు రుణముల యొక్క వ్యాపారమును చేయుచున్నారు. దిగువ తెలిపిన టేబుల్‌లోని కాలమ్ నెం. 2 లో తెలిపిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణమును పొందినారు. SARFAESI చట్టము క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన MAHOFIN సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 2తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ నోటీసులో తెలిపిన మొత్తము మరియు దానిపై తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు. కానీ అట్టి నోటీసులు వివిధ కారణముల వలన వారిలోని కొందరికి అందజేయబడలేదు. వారి కొరకు మరియు అదనముగా దిగువ తెలిపిన సదరు రుణగ్రహీతల సమాచారం కొరకు ఈ బహిరంగ నోటీసు జారీ చేయడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నెం./బ్రాంచ్ | ఆసక్తి వ్యక్తీకరించిన సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ | ఎన్‌పి తేది | నోటీసు పంపిన తేది & బకాయి మొత్తం |
|---|---|---|---|---|
| 1 | మంధ స్వర్ణ లత, మంధ ఇస్సాక్, మంధ కార్తీక్/ MO90LALONS000005011192/ విజయవాడ | పిన్: 506015, ఆంధ్రప్రదేశ్, వరంగల్ అర్బన్ జిల్లా, హసన్‌పర్తి మం॥, భీమారం గ్రా॥, ఆర్ఎస్ నెం. 11/ఏలో 183 చ॥గజాల విస్తీర్ణములోని స్థలం యొక్క ఆర్‌సిసి రూఫ్డ్ భవనముతో ఇంటి నెం. 55-2-993, కొత్త జీహెచ్ నెం. 2-483 యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: కె పురుషోత్తం యొక్క ఇల్లు, పడమర: అబ్దుల్ నబి ఆస్తి యొక్క ఖాళీ భూమి, దక్షిణం: ఇంటి నెం. 55-2-992, ఎం సుధాకర్ ఆస్తి, ఉత్తరం: రోడ్డు. | 28-02-2026 | 18-03-2026 & రూ. 1310086/- |

కావున ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతకు వ్యతిరేకముగా పైన చూపించిన విధముగా రావలసిన పూర్తి బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించమని పైన తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరడమైనది. పూర్తి బకాయి మొత్తము మరియు తదుపరి వడ్డీతో సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత చెల్లించుటలో విఫలమైతే, MAHOFIN వారు పైన తెలిపిన విధముగా ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చేయుట కొరకు సెక్షన్ 13(4) క్రింద ముందుకు సాగెదరు, చట్టము మరియు అందులో ఏర్పడిన రూల్స్ క్రింద పేర్కొన్న విధముగా ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు చర్యలు తీసుకొనబడును. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(8)లో వివరించిన విధముగా అమ్మకం రూపములో బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం లేదా బహిరంగ వేలం కొరకు నోటీసు ప్రచురణ తేదీలోగా ఏ సమయములోనైనా పూర్తి బకాయి మొత్తము మరియు వ్యయాలు, చార్జీలు & MAHOFIN వారిచే వెచ్చించిన ఖర్చులతో మీరు చెల్లించినచో సదరు తనఖాను విడిపించుకొనవచ్చునని మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(13) ప్రకారం అమ్మకం, లీజు లేదా వేరే ఇతర పద్ధతులలో సెక్యూర్డ్ ఆస్తులను బదిలీ చేయుట మరియు/లేదా వ్యవహరించుట నుండి మీరు నిషేధించబడినారని గమనించగలరు.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేది: 31-03-2026 సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

# ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు

### మూడు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

**అమరావతి, మార్చి 30 (నినాదం):**



ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో వైసీపీ నేత, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని, విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు కేసును బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వైసీపీ నేత పిటిషన్ వేశారు. అలాగే ఈ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లంటిపై హైకోర్టులో విచారణ జరిగింది. దాదాపు మూడు వారాల పాటు విచారణ జరిగిన అనంతం సోమవారం ఉదయం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే వ్యాజ్యాల విచారణార్హతపై కూడా ఇటీవల న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇలాంటి పిటిషన్లకు విచారణార్హత లేదని సిద్ధార్థ లూథ్రా వాదించారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న ఏపీ హైకోర్టు.. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదంటూ వేర్వేరుగా దాఖలు చేసిన మూడు పిటిషన్లను డిస్మిస్ చేసింది.

# నరసరావుపేట కుటుంబ ఆత్మహత్యాయత్నం కేసు

### చికిత్స పొందుతూ డాక్టర్ గోపి మృతి.. ఇప్పటికే మృతి చెందిన భార్య, కూతురు

**పల్నాడు, మార్చి 30 (నినాదం):**

నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరు మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యుడు గోపి సోమవారం చనిపోయారు. నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. నాదెండ్ల మండలానికి చెందిన డాక్టర్ కుంభ గోపి కుటుంబం ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారి మౌనిక, భార్య శంకర కుమారి మృతి చెందగా.. డాక్టర్ గోపి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం కన్నుమూశారు. గోపి కుటుంబం భోపాల్‌లో నివాసం ఉంటోంది. భోపాల్ ఎయిమ్స్‌లో గోపి డాక్టర్‌గా, అతడి భార్య శంకర కుమారి నర్స్‌గా పనిచేస్తున్నారు. వారికి మూడేళ్ల కుమార్తె మౌనిక ఉంది. చిన్నారి మౌనికకు పుట్టినప్పటి నుంచి డౌన్ సిండ్రోమ్ అనే అనారోగ్య సమస్య ఉండటంతో తండ్రి గోపి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ కారణంగా గోపి కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్రం చేసినట్లు తెలుస్తోంది. గోపి కుటుంబం శనివారం రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేటకు వచ్చింది. ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని చిన్నారితో సహా భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. మత్తు ఇంజెక్షన్ తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జాతీయ మెగా లోక్-అదాలత్‌లో 353 కేసుల రాజీ

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వెల్లడి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**



జాతీయ మెగా లోక్-అదాలత్ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రాజీ పడదగిన కేసులను పరిష్కరించడం జరిగిందని, ఇందులో 356కేసులు రాజీమార్గంలో పరిష్కారమైనట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు.ఈ కేసుల్లో ఇరు వర్గాలను సమన్వయం చేసి రాజీ కుదిర్చి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం చేయడం లోక్-అదాలత్ ముఖ్య ఫలితంగా నిలిచిందని. 24 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ. 1,61,441ల మొత్తాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేయుటకు సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీలు పంపడం జరిగిందని, ఇది బాధితులకు గొప్ప ఉపశమనంగా మారిందన్నారు. లోక్-అదాలత్ అనేది క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునే అద్భుతమైన వేదిక అని పేర్కొన్నారు. చిన్న చిన్న గొడవలు, వివాదాలు కోర్టుల్లో సంవత్సరాల పాటు కొనసాగకుండా, ఇరు వర్గాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. "రాజీ మార్గమే రాజమార్గం" అనే భావన ప్రతి ఒక్కరికి ఉండాలని సూచించారు. ఈ లోక్-అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, సైబర్ క్రైమ్ యూనిట్ ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. లోక్-అదాలత్ వంటి వేదికలు సమాజంలో శాంతి, సామరస్యాలను నెలకొల్పడంలో కీలకపాత్ర పోషిస్తాయని, ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

### 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ
### నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు
### ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్

**అమరావతి, మార్చి 30 (నినాదం):**



ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లు కట్టిచ్చాం

### విజయవాడలో టిడ్కో ఇళ్ల పంపిణీలో బోండా ఉమ

**విజయవాడ, మార్చి 30 (నినాదం):**



టిడ్కో ఇళ్లలో ఉన్న 10 శాతం వసతులు కూడా సెంట్‌లో కట్టిన ఇళ్లలో లేవని ఎమ్మెల్యే బొండా ఉమ అన్నారు. సోమవారం విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ఈ ఇళ్ల నిర్మాణం కోసం గత 5 ఏళ్లలో ఎన్నో బాధలు, కష్టాలు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను ఇచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసుకోమని బలవంతం చేశారని.. కానీ చాలా మంది ప్రజలు వారి అబద్ధపు మాటలు నమ్మకుండా నిలబడ్డారని ఎమ్మెల్యే బొండా ఉమ తెలిపారు. పార్టీలకు అతీతంగా టిడ్కో ఇళ్లకు లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2019 ` 24 మధ్య జగన్ హయాంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. జగన్ వైరస్ వల్ల అన్ని వ్యవస్థలు కుంగిపోయాయని వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థలను గాడిలో పెట్టడానికి ఇంత కాలం పట్టిందని ఎమ్మెల్యే తెలిపారు.

# వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

**విజయవాడ, మార్చి 30 (నినాదం):**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వేతన సవరణ కమిటీ చైర్మన్ నియామకాన్ని వెంటనే చేపట్టాలని ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్ డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఏడాదిగా విరమణ బెనిఫిట్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.



# ప్రజావాణి ఫిర్యాదులు ఆర్జీలను వేగంగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, మార్చి 30 (నినాదం)**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పి సీఈవో యాదయ్యతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# సంరక్షకత్వం జారీకి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటన




**వనపర్తి ప్రతినిధి, మార్చి 30 (నినాదం)**

మానసిక, బహుళ వైకల్యం, బుద్ధి మాంద్యం దివ్యాంగుల తలిదండ్రులు, సంరక్షకులకు సంరక్షకత్వం ధృవీకరణ పత్రం జారీ చేసేందుకు వనపర్తి జిల్లాలో జిల్లా స్థాయి కమిటి ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన 5 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించారు. జాతీయ ట్రస్టు చట్టం 1999 ప్రకారం మానసిక, బహుళ వైకల్యం, బుద్ధి మాంద్యం వంటి దివ్యాంగుల సంరక్షణ కొరకు అధికారికంగా సంరక్షకత్వం ధృవీకరణ పత్రాన్ని అధికారికంగా జారీ చేసేందుకు ఈ చట్టం అవకాశం కల్పించిందన్నారు. బుద్ధి మాంద్యం, బహుళ వైకల్యం ఉన్న దివ్యాంగులు కొందరు 18 సంవత్సరాల వయసు దాటిన తర్వాత కూడా వారు స్వయం నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండదని అలాంటప్పుడు సదరు వ్యక్తికి సంబంధించిన బ్యాంకు అకౌంటు, లావాదేవీలు లేదా న్యాయాత్మక నిర్ణయాలు తీసుకోవడం లో వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల జోక్యం అవసరం ఉంటుందన్నారు. కానీ దివ్యాంగుడికి 18 సంవత్సరాల వయస్సు దాటినందున వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నిర్ణయాలు లేదా అధికారాలు చట్ట ప్రకారం చెల్లవు. అందువల్ల అలాంటి తల్లిదండ్రులు, సంరక్షకులు జిల్లా కమిటీకి సంరక్షకత్వం ధృవీకరణ పత్రాన్ని పొందటానికి దరఖాస్తు చేసుకుంటే కమిటీ ద్వారా అన్ని పరిశీలించి సంరక్షకత్వం ధృవీకరణ పత్రం జారీ చేస్తుందని తెలిపారు. ఈ సంరక్షకత్వం ధృవీకరణ పత్రం పొందిన వారు మాత్రమే అధికారికంగా సంబంధిత దివ్యాంగుల నిర్ణయాధికారాలను పొందుతారని తెలియజేశారు. ఇప్పటి వరకు వనపర్తి జిల్లాలో సంరక్షకత్వం ధృవీకరణ కొరకు 3 దరఖాస్తులు రావడం జరిగిందని, వాటిని కమిటీ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి సంరక్షకత్వం ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షులు గాను, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మెంబర్ కన్వీనర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఒక దివ్యాంగురాలు ఎ.లక్ష్మి బాయి, ఇకో క్లబ్ బ్రహ్మ ఇన్స్టిట్యూట్ ఫర్ మెంటల్లీ హ్యాండిక్యాప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చంద్ర శేఖర గన్నోజి కమిటీ సభ్యులు గా 3 సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహిస్తారని కలెక్టర్ చెప్పారు

# డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

### అరైవ్ అలైవ్ లో భాగంగా కంటి వైద్య శిబిరం
### కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ నరసింహ





**కోదాడ,మార్చి 30(నినాదం):**

రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని అన్నారు. మంచివారికి పోలీసు మిత్రుడిగా ఉంటామని, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు ప్రధాన సమస్యలుగా మారాయని, అపరిచితుల ఫోన్ కాల్స్, బ్లూ లింక్స్, ఓటీపీ వివరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ శిబిరంలో అశోక్, పుల్లూరి, సురభి, లక్ష్మి కంటి ఆసుపత్రుల వైద్యులు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. 500 మందికి పైగా డ్రైవర్లు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుదీర్, వైద్యులు అశోక్ కుమార్, మల్లీశ్వరి, రామతులసి, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్ట్ నారాయణరావు

### వారికి పరిహారం అందిస్తామన్న డిజిపి.. ఎపి నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని ప్రకటన

**అమరావతి, మార్చి 30 (నినాదం):**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు. దాదాపు 36 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నారాయణ సహా మొత్తం 9 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ, డివిజనల్, ఏరియా కమిటీలకు చెందిన మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటుపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ముగింపు దశకు చేరుకున్నాయని, ఏపీ ఇప్పుడు నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని డిజిపి అన్నారు. అందరి కృషితో ఇది సాధ్యమైంది. కాల్పులు కూడా జరిగాయి, లొంగుబాట్లు కూడా జరిగాయి. మా పిలుపునకు స్పందించి 9 మంది లొంగిపోయారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. చెన్నూరు నారాయణకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల



ఆర్థిక సహాయం అందుతుంది. మిగతా వారికి 24.20 లక్షలు అందిస్తున్నాం' అని చెప్పారు. మావోయిస్టు అగ్రనేత గణపతి కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి, భద్రతలు మరింత బలపడుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నారాయణ మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. దేశంలో మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సాయుధ పోరాటాన్ని వదిలి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని తాను లొంగిపోయినట్లు నారాయణ చెప్పుకొచ్చారు. 1990లో ఉద్దానంలో ప్రజా ఉద్యమానికి ఆకర్షితులు అయ్యాను. అప్పుడే మావోయిస్టు పార్టీలో చేరాను. పార్టీ తీర్మానాలకు అనుకూలంగా పనిచేశాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేశాను. నేను మావోయిస్టు ఉద్యమాల్లో చేరినపుడు పరిస్థితులు, ఇప్పుడు చాలా మారాయి. మేం పనిచేసిన ఆదివాసీ అటవీ ప్రాంతంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అప్డేట్ కాకపోవటమే ఈ వైఫల్యానికి కారణం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పార్టీ నిర్ణయాలు తీసుకోవటంతో ఈ పరిస్థితి వచ్చింది. మావోయిస్టు పార్టీ పరిస్థితులకు అనుగుణంగా అప్డేట్ అవలేదు, అందుకే ఏవోబీ సహా దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగు అయింది' అని నారాయణ వివరించారు. 'సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలు మారలేదు. అందువల్లే పార్టీ ఇలా అయింది. పార్టీ హత్య చేసిన ఘటనల్లో నేను కూడా భాగస్వామి అయ్యాను. అయితే పార్టీ నిర్ణయాల్లో భాగంగా మాత్రమే అవి జరిగాయి. నాకు ఎవరితో వ్యక్తిగత విభేదాలు, శత్రువుత్వం లేదు. జరిగిన ఘటనకు నేను పశ్చాత్తాపపడుతున్నా' అని మావోయిస్టు నారాయణ చెప్పారు. నారాయణరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. ఆయన దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. 1990లో పీపుల్స్ వార్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో దిట్ట అనే పేరు నారాయణకు ఉంది. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. ఏపీ, ఒడిశాల్లో అనేక కేసులు ఆయనపై ఉన్నాయి.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య!

సంపాదకీయం

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆరఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికలు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.

## హైదరాబాద్,చెన్నైని మించి
# అమరావతి అభివృద్ధి

**యువత రాజకీయాల్లోకి రావాలి**
**టిడిపి అవకాశం ఇస్తుంది**
**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం**
**సూల్లూరుపేటలో టిడ్కో ఇళ్లను పంపిణీ**
**రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు**
**ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు**
**గత వైసిపిది పనికిమాలిన ప్రభుత్వం అంటూ విమర్శలు**

తిరుపతి :

రాజధాని అమరావతిని హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా తయారు చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని సిఎం చంద్రబాబు అన్నారు. యువతకు ఇదే ఆహ్వానం. టీడీపీలోకి వస్తే అవకాశాలు కల్పిస్తాం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వైసీపీలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలకు కోపం రావడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట వేదికగా 2.50 లక్షల ఇళ్లను లబ్దిదారులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. 2,50,893 పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేసి వారితో గ హ ప్రవేశం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంత భారీ మొత్తంలో గ హ ప్రవేశాలు చేయించడం ఇది రెండోసారి. మొదటి విడత కింద 12 నవంబర్ 2025న 3,00,192 ఇళ్లను పంపిణీ చేసింది. తాజాగా నేడు 1,00,875 టిడ్కో ఇళ్లతోపాటు మరో 1,50,018 ఇళ్లను మొత్తం 2,50,893 గ హాలను పేదలకు సీఎం చంద్రబాబు సర్కార్ అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..'మార్చి నెలలో మొన్ననే ఉగాది, నిన్న రంజాన్ జరుపుకున్నాం. ఇవాళ 2,50,893 మందికి ఇళ్ల పండుగ జరుపు కుంటున్నాం. ఇది ఒక చరిత్ర. వి అందరిలో ఆనందం చూస్తుంటే, నా జన్మ ధన్యమైందని అనిపిస్తోందని అన్నారు. భవిష్యత్తులో వి కన్నీ శుభాలే జరగాలని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు గుడిసెల్లో ఉండేవారం. ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇవ్వాలని, పక్కా ఇళ్ల నిర్మాణాలకి యుగపురుషుడు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనేది టీడీపీ సిద్ధాంతం. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హావి ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలని అస్తవ్యస్తం చేశారు. అన్నింటినీ సరిచేస్తున్నాం. ధనికవర్గాలు ఉండే మాదిరిగా టిడ్కో ఇళ్లని నిర్మించిన ఘనత టీడీపీదే. మంచి ఇళ్లు కడితే పాడు చేశారు. పేదల పొట్ట కొట్టారు. ఈ ఏడాది చివరికి పది లక్షల ఇళ్లు ప్రజలకి అందివ్వడమే లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం ప్రజావేదిక విధ్వంసంతో మొదలెట్టి రాష్ట్రం మొత్తాన్ని విధ్వంసం చేసింది. ఎక్కడ చూసినా అవినీతి, అధికార దుర్వినియోగం. రూ.174కోట్లు లబ్దిదారులు కడితే వాటినీ మాయం చేశారు. 82 వేల కుటుంబాలకి ఆ డబ్బును అకౌంట్లలో వేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులని దారి మళ్లించారు. నివాస యోగ్యంకాని స్థలాల్లో ఇళ్లు కట్టించారు. వైజాగ్‌లో ప్యాలెస్ నిర్మించుకున్నారు కానీ పేదలకి ఇళ్లు ఇవ్వడానికి మనసు రాలేదు. అంత పనికిమాలిన ప్రభుత్వాన్ని నేను నా జీవితంలో చూడలేదు. పేదలు ఉండాల్సింది మురికివాడల్లో కాదు. ఇలాంటి టిడ్కో ఇళ్లలో ఉండాలి. వి లో ఆశలు చిగురించాలి. ఇంటి జాగాలేని వారికి జాగా ఇస్తాం. బ్రహ్మాండంగా ఇళ్లు కట్టించి, పేదలకి ఒక ఆస్తి కల్పిస్తాం. ప్రతి ఇంటికీ అఔఉ కనెక్షన్ ఉండాలి. దానికి కూడా రాయితీ ఇస్తాం. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని పథకం మొదలెడితే దాన్నీ పాడు చేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంట్లో ఎక్కడికక్కడ విద్యుత్ తయారు చేసుకునే అవకాశం కల్పించాం. ఎస్సీలు, ఎస్టీలకి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకి రూ.20 వేలు రాయితీ ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలని చేస్తాం. రాబోయే ఎన్నికల్లో మహిళలకి సీట్లు పెరగబోతున్నాయి. వైసీపీ పాలనలో పోలవరాన్ని నాశనం చేశారు. గోదావరి పుష్కరాలకంటే ముందుగానే పోలవరాన్ని పూర్తి చేస్తాం. ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తాం. బాగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తాం. ప్రజలు మెచ్చేలా నాయకులు, అధికారులు పనిచేయాలి. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేకపోతే ఊరుకునేది లేదు. టెక్నాలజీ ఉపయోగించి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాం. పెన్షన్ల పంపిణీని రియల్‌టైమ్ మానిటర్ చేస్తున్నాం. బాగా పనిచేస్తున్న అధికారులను అభినందిస్తాం. పనిచేయని అధికారులతో పని చేయించడం మా బాధ్యతని అన్నారు.

## వాక్పటిమ నుంచి వాగ్వాదం వరకు
# చట్ట సభల భాషా పరిణామం

**నాడు సంస్కారం**
**నేడు సంచలనం:**
**సభల భాషలో మార్పుల కథనం**



చట్ట సభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిష్ఠాత్మక వేదికలు. ఇక్కడ వినిపించే ప్రతి పదం ప్రజల రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. "నాడు – నేడు" అనే కోణంలో పరిశీలిస్తే, ఒకప్పుడు గౌరవప్రదమైన, శాస్త్రీయమైన భాషకు నిలయంగా ఉన్న చట్ట సభలు, నేడు కొన్నిసార్లు రికార్డుల్లో చోటు పొందలేని అసభ్య, అవమానకర పదజాలంతో కూడా ముడి పడుతున్న దృశ్యం కనిపిస్తోంది.

స్వాతంత్ర్యానంతర కాలంలో తొలి లోక్‌సభలు, రాష్ట్ర శాసనసభలు ఒక విలక్షణ విద్యామండలి వలె ఉండేవి. సభలో మాట్లాడే ప్రతి సభ్యుడు తన వాక్చాతుర్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని, సంస్కారాన్ని ప్రతిబింబించేలా మాట్లాడేవాడు. "గౌరవ సభ్యుడు", "మహానీయులైన స్పీకర్ గారు" వంటి సంభాషణా పద్ధతులు సభా సంప్రదాయంగా ఉండేవి. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా, అంశపరమైన చర్చలకే ప్రాధాన్యం ఉండేది. ఆ కాలంలో ఉపయోగించిన పదజాలం రికార్డుల్లో నిలిచేలా శుద్ధంగా, సాహిత్య పరిమళంతో ఉండేది.

అయితే కాలక్రమేణా రాజకీయ వ్యవస్థలో పోటీ పెరగడం, మీడియా ప్రభావం, ప్రత్యక్ష ప్రసారాల విస్తరణ వంటి కారణాలతో చట్ట సభల భాషలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా 1980ల తర్వాత ఈ మార్పు వేగవంతమైంది. సభలు ప్రజల దృష్టిని ఆకర్షించే వేదికలుగా మారడంతో, కొంతమంది సభ్యులు కఠిన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు.
నేటి పరిస్థితుల్లో, చట్ట సభలలో వినిపించే కొన్ని పదజాలాలు అధికారిక రికార్డుల్లో నమోదు చేయడానికి అనర్హంగా పరిగణించబడుతున్నాయి. వీటిని "అన్‌పార్లమెంటరీ ఎక్స్‌ప్రెషన్స్"గా పిలుస్తారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల నియమావళి ప్రకారం, వ్యక్తిగత అవమానాలు, అసభ్య పదాలు, కించపరిచే వ్యాఖ్యలు—ఇవి రికార్డుల నుండి తొలగించబడతాయి.
తెలుగు రాష్ట్రాల శాసనసభల్లో తరచుగా వినిపించి, తరువాత రికార్డుల నుండి తొలగించబడిన కొన్ని అన్‌పార్లమెంటరీ పదజాలాల ఉదాహరణలు పరిశీలిస్తే పరిస్థితి స్పష్టమవుతుంది. ఉదాహరణకు "దొంగ", "మోసగాడు", "అబద్ధకోరు", "నిర్లజ్జుడు", "అసమర్థుడు", "దుర్మార్గుడు" వంటి పదాలు వ్యక్తిగత దూషణలకు చెందినవిగా పరిగణించబడి రికార్డుల్లో నిలవవు. అలాగే "చెత్త ప్రభుత్వం", "అవినీతి కూపం", "పిచ్చి నిర్ణయం", "బుద్ధి లేని చర్య" వంటి వ్యాఖ్యలు కూడా సందర్భానుసారం తొలగించ బడతాయి. కొన్నిసార్లు "గద్దె దిగిపో", "నీవు అర్హుడు కావు", "నీకు సంస్కారం లేదు" వంటి వ్యాఖ్యలు కూడా సభా గౌరవానికి భంగం కలిగించేవిగా భావించ బడతాయి.
ఇంకా కొంత ఘాటైన సందర్భాల్లో, పరస్పర ఆరోపణల మధ్య వినిపించే పదజాలం మరింత తీవ్రమై, వెంటనే స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పదాలను రికార్డుల నుండి తొలగించే పరిస్థితులు ఏర్పడు తున్నాయి.

ఇటువంటి సందర్భాలు గత రెండు దశాబ్దాల్లో పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2000ల ప్రారంభంలో అన్‌పార్లమెంటరీ పదాల తొలగింపులు పరిమితంగా ఉండగా, ఇటీవల కాలంలో ఇవి గణనీయంగా పెరిగాయి.
పార్లమెంట్, శాసన సభలలో సమావేశాల సంఖ్య కూడా తగ్గింది. 1950లలో సంవత్సరానికి సగటున 120 రోజులు సమావేశాలు జరిగేవి. ప్రస్తుతం అది 60–70 రోజులకు పరిమితమైంది. అదే సమయంలో, అంతరాయాలు, నినాదాలు, నిరసనలు పెరగడం వల్ల చర్చలకు లభించే సమయం తగ్గింది. 16వ లోక్‌సభలో సుమారు 40 శాతం సమయం అంతరాయాలకు గురైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

ఈ వాతావరణంలో భావోద్వేగ పూరిత, కొన్నిసార్లు అసభ్య పదజాలం వినిపించడం ఎక్కువైంది.
సోషల్ మీడియా ప్రభావం కూడా భాషపై తీవ్రంగా పడింది. తక్షణ స్పందనల సంస్కృతి కారణంగా రాజకీయ నాయకులు ఘాటైన వ్యాఖ్యలకు అలవాటు పడిపోయారు. అదే ధోరణి చట్ట సభలలోనూ కనిపిస్తోంది. ఫలితంగా, ఆలోచనాత్మక చర్చల స్థానంలో కొన్నిసార్లు వ్యక్తిగత విమర్శలు, నినాదాలు ప్రాధాన్యం పొందుతున్నాయి.

అయితే ఈ పరిణామాన్ని పూర్తిగా ప్రతికూలంగా మాత్రమే చూడలేము. నేటి చట్ట సభలలో అణగారిన వర్గాల స్వరాలు బలంగా వినిపిస్తున్నాయి. వారి భాషలో ఆవేదన, కోపం సహజమే. కానీ అది అసభ్య పదజాలంగా మారకుండా నియంత్రించాల్సిన బాధ్యత సభ్యులపైనే ఉంది.

భవిష్యత్తులో చట్ట సభల గౌరవాన్ని కాపాడటానికి భాషా నియంత్రణ అత్యవసరం. స్పీకర్‌లు, చైర్మన్‌లు కఠినంగా వ్యవహరించాలి. సభ్యులకు పార్లమెంటరీ ప్రవర్తనపై శిక్షణ ఇవ్వాలి. ప్రతి సభ్యుడు తన మాటల ప్రభావాన్ని గుర్తించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.
మొత్తంగా చూస్తే, నాడు చట్ట సభల భాష ఒక ఆదర్శంగా నిలిచింది. నేడు కొన్ని సందర్భాల్లో అది రికార్డుల్లో చోటు పొందలేని స్థాయికి దిగజారింది. "దొంగ", "మోసగాడు", "నిర్లజ్జుడు", "చెత్త ప్రభుత్వం", "పిచ్చి నిర్ణయం" వంటి పదజాలాల వినియోగం పెరగడం ప్రజాస్వామ్యానికి హెచ్చరిక. ఈ ధోరణిని సరిదిద్దడం ద్వారా మాత్రమే చట్ట సభలు తమ గౌరవాన్ని, విశ్వసనీయతను తిరిగి పొందగలవు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్...9440595494**

# ఈ గడ్డి మందును నిషేధించండి

"గంట సేపట్లో గడ్డి చనిపోయే మందు" ఇవ్వండి అని నా కళ్ళ ముందరే రైతు ఒగ్గు కనకయ్య పురుగుల మందు షాపు యజమానిని కృష్ణ ను అడగగా ఆయన ఒక లీటరుకు 400 రూపాయలు తీసుకొని ఆ గడ్డి మందను ఇచ్చాడు. బుచ్చిమల్లు దుర్గయ్య అనే రైతు ఓరాల (గట్టు) పైన గడ్డి బాగా ఉంది గా "24 గంటల గడ్డి మందు" ఇవ్వు అని 450 రూపాయలు తీసుకొని వచ్చాడు. పేరు ఏదైనా, ఏ పంటలో గడ్డి నివారణకైనా ఆమందే వాడతారు, అదే పారాక్వాట్ (Paraquate Dichloride 24% ) ఈ గడ్డి మందును వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా పిలుస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దీనిని 'స్పాట్ ' (Spot) గా ఉమ్మడి మెదక్ జిల్లాలో '24 అవర్స్' గా (24 Hours) ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో "24 గంటలు"గా పిలుస్తారు. కూలీల కొరత కావచ్చు! డబ్బులు ఆదా కావచ్చు! పని తొందరగా అవుతుందని కావచ్చు! చేనులో మళ్ళీ మళ్ళీ గడ్డి రాదు అని కావచ్చు! చివరకు గ్రామపంచాయతీ సిబ్బంది కూడా గ్రామాలను గడ్డి వివరణ కోసం ఈ మందుని వాడుతున్నారు. దేనికైనా ఈ గడ్డి మందే పరిష్కారం అనుకొని రైతులు విచ్చలవిడిగా పంట పొలాల్లో వినియోగిస్తున్నారు. విరుగుడు లేని పారాక్వాట్ గడ్డి మందు మన రాష్ట్రంలో ఏటా సుమారు 5000 మందిని బలి తీసుకుంటుందనీ అంచనా! అప్పుల బాధతో రైతులు, చదువు, ప్రేమ, నిరుద్యోగముతో యువత, కుటుంబం పోసిన భారమై, అనారోగ్య సమస్యలు, వరకట్న మొదలైన సమస్యలతో సతమతమవుతున్న యువత చావే పరిష్కారమనుకొని పారాక్వాట్ గడ్డి మందులు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మందుకు చికిత్స లేదని వైద్యం చెబుతున్నారు.

సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం, ఎల్కంటి గ్రామంలో 2024 సంవత్సరంలో 12 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే అందులో 8 మంది ఈ పారాక్వాట్ అనే అనే గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మిగతా నలుగురు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నేను జరిపిన సర్వేలో వెల్లడయింది. ఆ గ్రామ యువకుడు కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా గ్రామంలో చాలా మంది రైతులు కూరగాయలు, ఆకుకూరలు, మొక్కజొన్న, వరి లాంటి పంటల కలుపు గడ్డి నివారణ కోసం ఈ పారాక్వాట్ ఉపయోగిస్తారు. అది ఒక లీటరుకు సుమారు 400 నుంచి 500 రూపాయల వరకు ధర ఉంటుంది. ఒక ఎకరా బెండ చెట్లలో గడ్డి కలవడానికి సుమారు 12 మంది కూలీలు అవసర పడతారు. ఒక్కొక్కరికి 300 చొప్పున 3600 ఖర్చు అవుతుందని ఆ కలుపు తీయడానికి రెండు రోజులు సమయం పడుతుందని ఆ కూలీలు కూడా దొరకడం చాలా కష్టంగా ఉందని అదే "24 గంటల" మందు గంట సేపట్లో స్ప్రే చేస్తే 24 గంటలలో గడ్డి చనిపోతుందని నాలుగైదు వందల రూపాయలతో పని అయిపోతుందని ఆ యువకుడు చెప్పాడు. ఇది అన్ని పెస్టిసైడ్ షాపులలో విరివిగా లభిస్తుంది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన కావలి నర్సింలు అనే రైతు జనవరి 2026 సంవత్సరంలో అప్పుల బాధతో ఈ గడ్డి మందుల తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సాయమ్మ చెప్పారు.
విరుగుడు లేని పారాక్వాట్ గడ్డి మందును పంటలకు స్ప్రే చేసిన రైతులు కూడా ఎలాంటి ప్రికాషన్స్ తీసుకోకుండా అంటే పి పి కిట్స్, గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించకుండా గాలికి ఎదురుగా వెళ్లి ఆ గడ్డి మందులు స్ప్రే చేయడంతో ఎంతోమంది రైతుల కీలక అవయవాల పైన అటాక్ చేస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. గొంతు, పేగులు, ఊపిరితిత్తులు డామేజ్ అవుతాయని తద్వారా శ్వాస తీసుకోవడం కష్టం అవుతుందని తద్వారా కిడ్నీలు, లివర్ ఫెయిల్ అయి తీవ్రమైన నొప్పితో ఊపి రాడక చనిపోతారని డాక్టర్లు అంటున్నారు. ఇది తాగిన ఏ వ్యక్తి కూడా చావు నుంచి తప్పించుకోలేడని నా పరిశోధన ద్వారా తేలింది ఆ విషయాన్ని డాక్టర్లు కూడా ధృవీకరిస్తున్నారు.

కలుపు మొక్కలు చనిపోవడానికి ఈ మందులు ఎడాపెడా కొట్టడం వల్ల వ్యవసాయ భూముల నేల సారం పూర్తిగా దెబ్బతింటుంది, మట్టిలో ఉండే వానపాములు, పీతలు, కప్పలు, ఎలుకలు, పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. ఈ పంట పొలాలలో నీళ్లు తాగిన జంతువులు, పక్షులు కూడా చనిపోతాయి, ఈ గడ్డి మందును వాడిన కూరగాయలు, బియ్యం తిన్న ప్రజలకు కూడా దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.
భూమిని నిర్జీవంగా మార్చుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రాణాంతక పారాక్వాట్ ను నిషేధించాలని ఇండియన్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్,
హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్, పలు రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి. ఇప్పటికే సుమారు 70 దేశాల్లో బ్యాన్ చేశారు. పారాక్వాట్ అనే గడ్డి మందును దేశవ్యాప్తంగా నిషేధించాలని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య
27 మార్చి 2026 న లోక్ సభలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ మనదేశంలో కూడా కేరళ, పంజాబ్, ఒడిస్సా లాంటి రాష్ట్రాలు కూడా బ్యాన్ చేసినట్టు తెలుస్తుంది. మన రాష్ట్రంలో కూడా ఈ గడ్డి మందులు నిషేధించాలని తెలంగాణ సమాజం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.
ఈ ప్రాణాంతకమైన గడ్డి మందులు వాడొద్దని రైతులకు విజ్ఞప్తి తో పాటు ప్రభుత్వాలు ప్రకృతి మరియు సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ఇచ్చి రైతులను ప్రోత్సహించి పురుగుల మందులు, రసాయనిక ఎరువులు వాడని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకొని ఈ మందు నిషేధించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. "రైతును కాపాడుకుందాం! రైతులు గౌరవిద్దాం!!"

**పులి రాజు,**
**సామాజిక కార్యకర్త,**
**9908383567.**



# అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

**హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**
**శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**

**హైదరాబాద్ :**

రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆరఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆరఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

## ప్రజలు చరిత్ర నిర్మాతలు

రేపటి వసంతం కోసం
అమరులు నడిచిన దారులు చెదిరిపోవు.
చిందించిన రక్తం
వృధా పోదు.
ఎండిన డొక్కలోని పేగులతో వాళ్ళరక్తాన్ని
ఒడిసి పట్టి
నల్లరేగడి నేలల్లో విత్తనాలుగాచల్లుతారు.
ప్రజలు చరిత్రనిర్మా తలు
మొలకెత్తిన
త్యాగాలసాళ్లలో
కవాతైసాగుతారు.
అరుణోదయం కాంతుల్లో
అమరులు నేలపై
వెలుగులౌతారు.

**-బాలసాని రాజయ్య**

# పుచ్చకాయ కొంటున్నారా..?



**పసుపు రంగు మచ్చ:**
పుచ్చకాయను తిప్పి చూసినప్పుడు ఒక వైపు మచ్చ కనిపిస్తుంది. దీనిని ఫీల్డ్ స్పాట్ అంటారు. ఈ మచ్చ ముదురు పసుపు లేదా క్రీమ్ రంగులో ఉంటే,ఆకాయ తీగపైనే బాగా పండిందని అర్థం. ఒకవేళ ఆ మచ్చ తెల్లగా ఉంటే, అది ఇంకా పచ్చిగా ఉన్నప్పుడే కోసేశారని అర్థం. అలాంటి కాయలు తీయగా ఉండవు.

**బరువును గమనించండి:**
పుచ్చకాయను చేత్తో పైకి ఎత్తి చూడండి. అది దాని పరిమాణం కంటే ఎక్కువ బరువుగా అనిపించాలి. ఎక్కువ బరువు ఉందంటే అందులో నీటి శాతం ఎక్కువగా ఉందని, అది తాజాగా ఉందని అర్థం.

**పండులోంచి వచ్చే శబ్ధాన్ని గమనించడండి:**
మీ వేళ్లతో పుచ్చకాయను తట్టి చూడండి. ఒకవేళ నిండుగా కాకుండా, లోపల ఖాళీగా ఉన్నట్లు ప్రతిధ్వనించే శబ్దం వస్తే అది బాగా పండినట్లు గుర్తు. మొద్దుబారిన శబ్దం వస్తే అది పచ్చిగా ఉండే అవకాశం ఉంది.

**ఆకారం, చారలు:**
పుచ్చకాయ ఆకారం సమానంగా ఉండాలి. వంకరటింకరగా ఉంటే దానికి సరైన ఎండ, నీరు అందలేదని అర్థం. అలాగే కాయపై ఉండే చారలు ముదురు ఆకుపచ్చ రంగులో స్పష్టంగా ఉండాలి. పండుపై ఉన్న గోధుమ రంగు వెబ్బింగ్ గుర్తులు అది చాలా తీయగా ఉంటుందని సూచిస్తాయి.

**తొడిమను చూడండి:**
పుచ్చకాయ తొడిమ ఎండిపోయి ఉంటే అది పండినట్లు. ఒకవేళ తొడిమ ఆకుపచ్చగా, తాజాగా ఉంటే అది ఇంకా పక్వానికి రాలేదని అర్థం. వేసవితాపం నుండి ఉపశమనం పొందడానికి ఈ చిట్కాలను ఉపయోగించి సరైన పండును ఎంచుకోండి!

# పచ్చి కొబ్బరితో ఇలా లడ్డులూ..



**కావాల్సిన పదార్థాలు :**
రెండు కప్పుల పచ్చి కొబ్బరి తురుము, పావు కిలో బెల్లం లేదా పంచదార, మూడు టేబుల్ స్పూన్స్ నెయ్యి, పావు టీ స్పూన్ యాలకుల పొడి , బాదం పప్పులు, కిస్మిస్ లను తీసుకోవాలి.

**ముందుగా పచ్చి కొబ్బరి,**

**బెల్లం రెడీ చేసుకోవాలి**: ఒక గిన్నె తీసుకుని పచ్చి కొబ్బరిని బాగా తురుము కోవాలి. ఇంకా దీనిలో బెల్లం తురుమును కూడా వేసుకుని మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి.

**ఇక ఇప్పుడు కుకింగ్ మొదలు పెట్టాలి:** పాన్‌లో 1 టీ స్పూన్ స్పూన్ నెయ్యి వేసి, కొబ్బరి బెల్లం మిశ్రమం కూడా దానిలో వేసి మీడియం మంట పై 10 నిమిషాలు వాటిని కలుపుతూ బాగా ఉడికించాలి. యాలకుల పొడి, కొద్దిగా జీలకర్ర కూడా వేసి ఈ మిశ్రమంలో బాగా కలుపుకోవాలి. పాన్ ను కిందకి దించి ఆ మిశ్రమాన్ని చల్లార్చి అలా ఫ్యాన్ కింద ఒక 30 నిముషాల పాటు అలాగే ఉంచాలి.

**లడ్డూలుగా చేసుకోవాలి:** ఇక ఇప్పుడు వీటిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. అలాగే, కిస్మిస్ లు కూడా దీనిలో వేసుకోవాలి. లడ్డూలను ఒక ప్లేట్‌లో ఉంచి పూర్తిగా చల్లారిన తర్వాత సర్వ్ చేయాలి. ఇలా చేస్తే ఈజీగా 7-10 రోజుల వరకు నిల్వ ఉంటాయి.

# బొప్పాయిపై చిన్నచూపు చూడొద్దు..

## ఈ సమస్యలకు దివ్యౌషధం.. ఈ ఆకు రసంతో ఇలా చేశారంటే..



బొప్పాయి పండు అనేక పోషకాలకు మూలం.. కాగా, దాని ఆకులు సైతం అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ కారణంగానే బొప్పాయి ఆకులను ఆయుర్వేద మందుల తయారీలో విస్తృతంగా ఉపయోగిస్తారు.



బొప్పాయి ఆకుల రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుండి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. బొప్పాయి ఆకులను జ్యూస్ చేసి తాగడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుకోవచ్చు. ఈ జ్యూస్ జ్వరాలు రాకుండా రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. బొప్పాయి ఆకుల రసంలో విటమిన్లు ఏ, ఈ, సి, కె, బి లు అధికంగా లభిస్తాయి.. ఇవి శరీర ఆరోగ్యానికి అత్యవసరం. షుగర్ లెవెల్స్‌ను నియంత్రణలో ఉంచడంలో బొప్పాయి ఆకుల రసం సహాయపడుతుంది. ముఖ్యంగా, శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచగల సామర్థ్యం దీనికి ఉందని, తద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయని పరిశోధనలు తెల్పాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది అద్భుతంగా పనిచేస్తుందని నిరూపితమైంది.

మలబద్ధకం సమస్యలతో బాధపడుతున్న వారికి బొప్పాయి ఆకు జ్యూస్ మంచి పరిష్కారం చూపుతుంది. దీనిని తీసుకోవడం వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది. అంతేకాకుండా, కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి కూడా ఇది తోడ్పడుతుంది. జుట్టు సంరక్షణలోనూ బొప్పాయి ఆకుల రసం కీలక పాత్ర పోషిస్తుంది. చుండ్రు, జుట్టు రాలిపోవడం, తలలో దురద వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు ఈ రసాన్ని తలకు పట్టిస్తే ప్రయోజనం ఉంటుంది. జుట్టు తెల్లబడటం, సన్నగా అయిపోవడం వంటి సమస్యలకు కూడా ఇది బాగా పనిచేస్తుంది. జుట్టుకు మెరుపును అందించి, షాంపూ, కండిషనర్ లాగా పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు.



బొప్పాయి ఆకుల్లో ఫెనోలిక్ కాంపౌండ్, పపాయిన్, ఆల్కలాయిడ్స్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేసి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. క్యాన్సర్ రాకుండా నివారించడంలో కూడా బొప్పాయి ఆకుల రసం ఉపయోగపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆహారం సరిగ్గా అరగక, కడుపు ఉబ్బరంగా ఉండే వారికి ఒక టేబుల్ స్పూన్ బొప్పాయి రసం చాలా మేలు చేస్తుంది.

పొట్టలో గ్యాస్, అల్సర్, నొప్పి వంటి జీర్ణ సంబంధిత సమస్యలను ఇది నివారిస్తుంది. మహిళల్లో రుతుక్రమ సమస్యలను సరిచేయడంలో, శరీరంలో హార్మోన్లను క్రమబద్ధీకరించడంలో కూడా బొప్పాయి ఆకుల రసం బాగా ఉపయోగపడుతుంది. ఈ అద్భుతమైన సహజ ఔషధంతో ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చు. అయితే.. ఇది కేవలం సమాచారం కోసం మాత్రమే.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే.. వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



# విశ్వరహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్

## సైన్స్ పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతి

**అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, అంతటి ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయననూ ఆయనలాంటి వారినీ ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఈయన ఓ సిద్ధాంత కర్త మరియు తత్వవేత్త కూడా. ప్రకృతిసిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం అంతా ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది.**

ప్రపంచంలోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం.

విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు.

న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవాడు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారంలాంటివి కూడా ఆయన తయారు చేశాడు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో ఉన్నాయి.

1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించాడు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించాడు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించాడు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై



పూర్తిగా అనుమానం తొలిగిపోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది.
విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్‌స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలినవాడు ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి

మొదటి సూత్రము
"బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు.
రెండవ సూత్రము
"ఒక వస్తువు ద్రవ్యవేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది

న్యూటన్ మూడవ నియమం

చర్యకు ప్రతి చర్య సమానంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును. భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించాడు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది.

మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ కాస్తా సర్ ఐజాక్ న్యూటన్‌గా మారిపోయారు.

ఆ తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 31, 1727న మరణించారు.

**-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



# భారీ నష్టాల్లో సూచీలు..

## సెన్సెక్స్ 1636 పాయింట్లు పతనం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందన్న భయాలు, చమురు ధరల భగభగలు, ఇరాన్‌కు మద్దతుగా హూతీ గ్రూప్ రంగంలోకి దిగడం వంటి పరిణామాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 22,350 దిగువన ముగిసింది. మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.412 లక్షల కోట్లకు చేరింది. మొత్తానికి ఆర్థిక సంవత్సరం చివరి రోజున సూచీలు నష్టాల్లో ముగిశాయి. మహావీర్ జయంతి సందర్భంగా రేపు (మార్చి 31) స్టాక్ ఎక్స్ఛేంజీలు పనిచేయవు.



సెన్సెక్స్ ఉదయం 72,565.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,583.22) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,774.13 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1635.67 పాయింట్ల నష్టంతో 71,947.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 488.20 పాయింట్ల నష్టంతో 22,331.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.94గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే..**

ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ సర్కారు భూతల దాడులకు సిద్ధమవుతోందన్న వార్తలు వేళ.. తాము కూడా వారి రాకకోసం ఎదురు చూస్తున్నాయని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ పేర్కొన్నారు. అమెరికా దళాలు అడుగుపెట్టగానే వారిని బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత తీవ్రం కావొచ్చన్న భయాలు నెలకొన్నాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇప్పుడు ఇరాన్‌కు మద్దతుగా హూతీ రెబెల్ గ్రూప్ రంగంలోకి దిగింది. అది ఎర్ర సముద్రంలో మళ్లీ నౌకలపై ఈ గ్రూపు దాడి చేస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ మూడు శాతం పెరిగి, ఒక బ్యారెల్‌కు 115.9 చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు కూడా మన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీనికితోడు ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడంతో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. శుక్రవారం కూడా రూ.4367 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడం గమనార్హం

నినాదం మార్కెట్

## వోల్టాస్‌కు రూ.23.52 కోట్ల డిమాండ్ నోటీసు




ప్రముఖ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ వోల్టాస్‌కు కస్టమ్స్ విభాగం డిమాండ్ నోటీసు జారీ చేసింది. 2019 జూన్ నుంచి 2022 జులై మధ్య కాలంలో దిగుమతి చేసుకున్న వస్తువుల వివరాలను తప్పుగా వెల్లడించినట్లు నోటీసులో పేర్కొంది. సుంకాలు, జరిమానాలతో కలిపి మొత్తంగా రూ.23.52 కోట్లు చెల్లించాలని వోల్టాస్ కంపెనీని ఆదేశించింది. రూ.10.76 కోట్ల కస్టమ్స్ డ్యూటీ, రూ.12.76 కోట్ల జరిమానాను చెల్లించాలని పేర్కొంది. అయితే, కస్టమ్స్ నోటీసును ఖండిస్తున్నామని, సంబంధిత ట్రైబ్యునల్‌లో సవాలు చేస్తామని వోల్టాస్ స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు తమ కంపెనీ ఆర్థిక, నిర్మాణ కార్యకలాపాలపై ఎటువంటి ప్రభావం చూపబోవని తెలిపింది. టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ 1954లో ఏర్పాటైంది. ఏసీలు, వాటర్ కూలర్లు, కమర్షియల్ రిఫ్రిజిరేటర్లు తయారుచేస్తోంది.

# ఇక ఏడాది పొడవునా మామిడి పండ్లు!

## రైతు అద్భుత ప్రయోగానికి ఆనంద్ మహీంద్రా ఫిదా ..!

మామిడి పండు పేరు చెబితేనే నోరూరని వారుండరు. అయితే, వేసవి కాలం అయిపోగానే మామిడి సీజన్ కూడా ముగిసిపోతుందనే బాధ అందరిలోనూ ఉంటుంది. కానీ, ఇకపై ఆ చింత అక్కర్లేదని నిరూపిస్తున్నారు రాజస్థాన్‌లోని కోటాకు చెందిన ఒక సామాన్య రైతు. ఆయన పట్టుదల, ప్రయోగాత్మక ఆలోచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**ఎవరీ శ్రీ కిషన్ సుమన్?**

కోటా సమీపంలోని ఒక చిన్న గ్రామానికి చెందిన శ్రీ కిషన్ సుమన్ మొదట్లో గోధుమలు, వరి పండించేవారు. అయితే వ్యవసాయంలో రాబడి స్థిరంగా లేకపోవడంతో ఆయన కొత్త దారి వెతికారు. మొదట పూల సాగు వైపు మళ్లిన ఆయన, ఒకే గులాబీ మొక్కపై ఏడు రంగుల పూలు వికసించేలా చేసి తనలోని సృజనాత్మకతను చాటుకున్నారు. ఆపై ఆయన దృష్టి మామిడి సాగుపై పడింది.

**'సదాబహార్' మామిడి: ఒక అద్భుతం**

సుమారు పదేళ్ల క్రితం సుమన్ తన తోటలో ఒక ప్రత్యేకమైన మామిడి చెట్టును గమనించారు. అది మిగిలిన చెట్లలా కాకుండా ఏడాది పొడవునా పూలు పూస్తూ కనిపించింది. దీనిపై సుమన్ అనేక ప్రయోగాలు, గ్రాఫ్టింగ్ (అంటుకట్టడం) ప్రక్రియలు చేపట్టి 'సదాబహార్' అనే కొత్త రకాన్ని అభివృద్ధి



చేశారు.

**ఈ రకం ప్రత్యేకతలు:**

ఏడాదికి మూడుసార్లు: ఈ మామిడి చెట్టు ఏడాదికి మూడు సార్లు ఫలాలనిస్తుంది.
రుచి: ఇది ప్రసిద్ధ అల్ఫోన్సో మామిడిని పోలి ఉంటుంది.
నాణ్యత: తక్కువ పీచు, మంచి సువాసన, తియ్యని రుచి దీని సొంతం.
ఇప్పటికే ఈ సదాబహార్ మొక్కలు రాష్ట్రపతి భవన్ వరకు చేరుకున్నాయంటే దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

**ఆనంద్ మహీంద్రా ప్రశంసల జల్లు:**

ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఈ అద్భుతాన్ని సోషల్ మీడియా (ఎ) వేదికగా కొనియాడారు. 'ఇదే అసలైన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (వ్యాపారవేత్త లక్షణం)' అంటూ ఆయన సుమన్‌ను ప్రశంసించారు.

'మనం సాధారణంగా ఇంజనీరింగ్ క్యాంపస్‌లలోనే స్టార్టప్‌లను వెతుకుతాము. కానీ నిజమైన ఆవిష్కరణలు పొలాల్లో కూడా పుడతాయి. అనిశ్చితిని ఎదుర్కోవడంలో పట్టుదల, శాస్త్రీయ దృక్పథం, ప్రకృతి రహస్యాలను ఛేదించే ఓర్పు - ఇవే సుమన్‌ను గొప్ప వ్యాపారవేత్తగా నిలబెట్టాయి' అని ఆనంద్ మహీంద్రా అన్నారు.

అంతేకాకుండా, ఒకవేళ సుమన్ తన ఈ ప్రయోగాన్ని పెద్ద ఎత్తున విస్తరించాలనుకుంటే, తాను మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని మహీంద్రా ప్రకటించడం విశేషం.

**రైతు ఆదాయానికి కొత్త మార్గం**

వ్యవసాయం అంటే కేవలం సాంప్రదాయ పద్ధతులు మాత్రమే కాదు, ఊహకు అందని ఆవిష్కరణలు కూడా అని సుమన్ నిరూపించారు. ఈ 'సదాబహార్' మామిడి రకం గనుక అన్ని వాతావరణ పరిస్థితుల్లో విజయవంతమైతే, రైతుల ఆదాయం రెట్టింపు అవ్వడమే కాకుండా, వినియోగదారులకు ఏడాది పొడవునా పండ్ల రాణి 'మామిడి' అందుబాటులో ఉంటుంది. శ్రీ కిషన్ సుమన్ ప్రయాణం ప్రతి రైతుకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు ఒక గొప్ప స్ఫూర్తి.

# వీధి వీధిలో నిఘా నేత్రాలు... భద్రతకు బలమైన అడుగు..

– డీఎస్పీ రాములు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి చేతుల మీదుగా సీసీ కెమెరాల ప్రారంభం



**మెట్‌పల్లి, మార్చి 30 (నినాదం):** పట్టణంలో భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా మెట్‌పల్లి 26వ వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు, 26వ వార్డు కౌన్సిలర్ బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో ప్రతి వీధిలో ఈ కెమెరాలను అమర్చారు. సోమవారం ఈ కార్యక్రమానికి డీఎస్పీ రాములు, మున్సి పల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథులుగా హాజరై సీసీ కెమెరాలను ప్రారంభిం చారు. సీఐ అనిల్, ఎస్సై కిరణ్, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీసీ కెమెరాలు ప్రజలకు నిఘా నేత్రాలుగా పనిచేస్తాయని తెలిపారు. చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్, దొంగతనాల వంటి నేరాలను అరికట్టడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఘటనలు చోటుచేసుకున్న వెంటనే నిందితులను గుర్తించి పట్టుకోవడంలో పోలీసులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొడ్ల ఆనంద్, ధర్మపురి స్వరూప, వేణు, నాయకులు బొడ్ల రాహుల్, సుంకేటి విజయ్, సతీష్, బొడ్ల గౌతం, అజీత్, సంజీవ్, అంజయ్య, జెట్టి రూపేష్, శ్రీకాంత్, లత, లక్ష్మి, రాజు, భాయ్, హరితతో పాటు వార్డు ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలి

**కోతిరాంపూర్‌లో ప్రీ-స్కూల్ మేళా విజయవంతం**
**బాలల సమగ్ర అభివృద్ధిపై అవగాహనఆర్డీవో మహేశ్వర్**



**కరీంనగర్, మార్చి 30(నినాదం):** కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్ అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళి కలో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ కేంద్రంలో ప్రీ-స్కూల్ మేళా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా అంగన్వాడీ కేంద్రా లు కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, ఆటలు, పాటల ద్వారా పిల్లలకు బోధన జరుగు తోందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారం, బాలామృ తాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సీడీపీఓ సబితా ప్రీ-స్కూల్ విద్య ప్రాధాన్యత, తొలి 1000 రోజుల సంరక్షణ, పోషకా హారం అవసరంపై తల్లులకు అవ గాహన కల్పించారు. ఈ సంద ర్భంగా పిల్లలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు,ఆటలు నిర్వహిం చారు. దాదాపు 200 మంది పిల్లలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. భాషా, మేధో, సామాజిక మరియు సృజనాత్మక అభివృద్ధిపై వివరణ ఇచ్చి, పిల్లలకు ప్రగతి పత్రాలను అందజేశారు. ప్రీ-స్కూల్ సామగ్రి ప్రదర్శన ఆకట్టుకోగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.

# జాగృతిలో గుండేటి ప్రీతి చేరిక...




**మెట్‌పల్లి, మార్చి 30 (నినాదం):** హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి భవన్‌లో ఆది వారం రాత్రి నిర్వహించిన చేరికల కార్యక్రమంలో కోరుట్ల నియోజక వర్గం మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుండేటి ప్రీతి తన అను చరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగ్, రాష్ట్ర మహిళా జాగృతి అధ్యక్షురాలు మారుపల్లి మాధవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుండేటి ప్రీతి మాట్లాడుతూ... రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉద్యమ స్ఫూర్తి, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితురాలై జాగృతిలో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కవితక్క ను ముఖ్యమంత్రిగా చూడ టమే లక్ష్యం... ఆదిశగా నిరంతరం శ్రమిస్తా. అని ఆమె స్పష్టం చేశారు. కవితక్క నాయకత్వంలో ప్రజలు జాగృతిలో చేరి భాగస్వాములు కావాలని, రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్య మంత్రిగా కవితక్కను చూడాలని ప్రజలు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. తన చేరిక కు ప్రోత్సాహం అందించిన జాగృతి స్టేట్ అధికార ప్రతినిధులు శ్రీకాంత్ గౌడ్, గీతా గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలది ఉమాదేవి, సంజీవ్ కుమార్, హరీష్, కావ్య, నర్సయ్య, నరహరి, రాజేష్, సుమలత, విశాలి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కమిషనరేట్‌లో సిపిఆర్ శిక్షణ ప్రాణరక్షణపై అవగాహన**




**250 మందికి పరీక్షలు**

**కరీంనగర్, మార్చి 30(నినాదం):** కరీంనగర్ జిల్లా కమిషనరేట్‌లో సోమవారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసులకు, రాపిడో నిర్వాహకులకు సిపిఆర్ (హృదయ పునరుద్ధరణ విధానం)పై శిక్షణ ఇచ్చారు. హార్ట్ ఎటాక్ వంటి అత్య వసర పరిస్థితుల్లో ఆందోళనకు గురికాకుండా సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణా లను కాపాడవచ్చని వైద్యులు వివరించారు. ప్రతి ఒక్కరికీ సిపిఆర్‌పై అవగాహన ఉండటం అవసరమని, ఇది కార్డియాక్ అరెస్ట్ సమయంలో ప్రాణాపాయం నుంచి రక్షించే అవకాశాన్ని పెంచుతుందని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం పోలీసులు, వారి కుటుంబ సభ్యులు, రాపిడో నిర్వాహకులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 250 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమం మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వైద్యుడు డాక్టర్ లోకేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రసాద పంపిణీ



**కరీంనగర్, మార్చి 30(నినాదం):** కరీంనగర్ నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సేవా కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభిం చగా, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శివకాంత్, అధ్యక్షుడు శరత్ కృష్ణ, వినోద్ తదితర సభ్యులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దళితులను అవమానిస్తే

# "పాడి"కి పాడే కడతాం

**ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నేత అంబాల రాజు**



**జమ్మికుంట, మార్చి 30 (నినాదం) :** శాసనాలను చేసే నిండు శాసనసభలో ఒక దళిత ఎమ్మెల్యే మాజీ ఉప ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురా బాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి దళిత నేత అంబాల రాజు ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ రాజకీయ నాయకుడు ఉద్యమకారుడు మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నీ పట్టుకొని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా బెదిరింపులకు పాల్పడడం దళితులను అవమానించడమే అని ఆయన అన్నారు. కనీసం ఆయన వయసు కన్న గౌరవం ఇచ్చి మాట్లాడవలసిన ఎమ్మెల్యే నియంత పోకడలకు పోతున్నాడని దళితులంటే మొదటి నుండి ఎమ్మెల్యేకు చిన్న చూపు ఉందని తన పద్ధతి మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో తిరగనియ్యమని వారు డిమాండ్ చేశారు. ఎథిక్స్ కమిటీకి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లి ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు కఠిన చర్యలు తీసుకోవాలని అప్పుడే కాంగ్రెస్ పార్టీలోని నాయకులకు మనోధైర్యం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే బే షరతుగా క్షమాపణలు చెప్పి ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ ఎండి సలీం పాషా గొట్టే ప్రభుదాస్ చిలువేరు రాజమౌళి ఆకినపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పించన్ కోసం వృద్ధురాలి వినతి..



**మెట్‌పల్లి, మార్చి 30 (నినాదం):** మెట్‌పల్లి పట్టణంలోని 2వ వార్డు గాజులపేటకు చెందిన పానుగంటి ఆశగంగు (87) వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరే ట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను ఆశ్రయించారు. వృద్ధాప్యంలో జీవనం సాగించడం కష్టంగా మారిందని, ఇప్పటివరకు పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తగిన అర్హతలు, ఆధారాలు ఉన్నప్పటికీ పింఛన్ మంజూరు కాలేదని వాపో యారు. ఇప్పటికైనా తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వెంటనే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆమె కోరారు. ఈ మేరకు డిఆర్‌డీవో స్పందిస్తూ, సంబంధిత అధికారులతో విచారణ జరిపించి అర్హతలు పరిశీలించి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై వేగవంతమైన చర్యలు

**225 వినతులు స్వీకరణ పెండింగ్ లేకుండా పరిష్కారానికి ఆదేశాలు**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మార్చి 30(నినాదం):** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, విన తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాం తాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజ లు ప్రజావాణికి వస్తారని, ఆయా శాఖల అధి కారులు సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, పెండింగ్‌లో ఉంచకుండా సమయానుకూలంగా పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో మొత్తం225 ఫిర్యాదులు నమోద య్యాయి. సంబంధిత శాఖలు వెంటనే స్పం దించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి వినతిపత్రాలు స్వీకరిం చిన కలెక్టర్,వారి యోగక్షేమాలను అడిగి తెలు సుకుని సమస్యలపరిష్కారానికి కట్టుబడి ఉన్నా మని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి శ్రీధర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# చెల్పూర్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభం





**హుజూరాబాద్,మార్చి30(నినాదం):** ప్రజల ఆరోగ్యాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసు కుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. గర్భాశయ ముఖ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్‌ను ప్రజ లకు ఉచితంగా అందించేందుకు చర్యలు చేప ట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం చెల్పూర్ లోని పి.ఎస్ హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వంత డుపుల కస్తూరి చేతుల మీదుగా ఈ వ్యాక్సిన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలోఈకార్యక్రమం నిర్వహించబడింది. సర్పంచ్ మాట్లాడుతూ, ముఖ్యంగా 14 సంవ త్సరాల అమ్మాయిలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో అవసరమని తెలిపారు. ఈవయస్సులో వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భా శయ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని చెప్పారు. కొంత మంది వ్యాక్సిన్ పట్ల భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని,అయితే ఈవ్యాక్సిన్ పూర్తిగా సురక్షి తమైనదిగా, శాస్త్రీయంగా పరీక్షించబడి నదిగా తెలిపారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యాన్నిదృష్టిలో ఉంచుకొని ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈరోజు తీసుకునే చిన్న నిర్ణయం రేపటి పెద్ద ప్రమా దాన్ని నివారించగలదని పేర్కొన్నారు. గ్రామం లోని ప్రతిఒక్కరికీ ఈ వ్యాక్సిన్ అందేలా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పూర్తి సహకారం అం దించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తులసీదాస్, ఇతర వైద్యసిబ్బంది, జెడ్పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం అనురాధ,ఉపసర్పంచ్, వార్డు సభ్యు లు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాధనం దుర్వినియోగం చేస్తే సహించేది లేదు

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**
**వరద కాలువ సమస్య పరిష్కారానికి కృషి పబ్లిక్ టాయిలెట్ల పరిశీలన**





**జమ్మికుంట,మార్చి30(నినాదం) :** జమ్మికుంట పట్టణ ప్రజలు అందిస్తున్న పన్నులతోని మనం అభివృద్ధి చేస్తున్నామని అలాంటి ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని జమ్మి కుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను ఆయన సోమవారం కార్యాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. లక్షల రూపా యలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయి లెట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురా వాలని ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నుండి వస్తున్న వరద కాలువ తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దానికి శాశ్వత పరిష్కారం చూపేవిధంగా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకుంటారని చైర్మన్ పేర్కొన్నారు. వరద కాలువలో ఎక్కడైతే సమస్య ఏర్పడిందో అక్కడ స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే ప్రసక్తే లేదని వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. రాబోయే వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని హౌసింగ్ బోర్డ్‌కు ఎలాంటి ప్రమాదం లేకుండా ముం దస్తు చర్యలు తీసుకొని వారికి అండగా ఉండా ల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని రాజకీ యాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సంద ర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణా ళిక అధికారి శ్రీధర్ రాజకుమార్ తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్లూ బెల్స్‌లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు




**కరీంనగర్, మార్చి 30(నినాదం):** హనుమాన్ నగర్‌లో ఉన్న బ్లూ బెల్స్ హై స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

**భవిష్యత్‌కు బలమైన పునాది అవసరం:**
**ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్ రెడ్డి**

సాంప్రదాయ బద్ధంగా దీపప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలో చిన్నారులు నృత్యాలు, గేయాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా కూడా జంగా సునీత మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక దశలోనే బలమైన పునాది అవసరమని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సాహభరితంగా సాగిన ఈ కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు పట్టాభిషేక ధ్రువపత్రాలు అందజేశారు.

కెవికెలో భూమి సుపోషణ

# సంరక్షణ వేడుకలు




**జమ్మికుంట, మార్చి 30 (నినాదం):** కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట లో గ్రామ నవ నిర్మాణ సంస్థ సంస్థాపకులు కీ.శే పరిపాటి జనార్ధన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దేశ వ్యాప్త జన అభియాన్ లో భాగంగా భూమి సుపోషణ – సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ నవ నిర్మాణ సంస్థ సంస్థాపకులు కీ.శే పరిపాటి జనార్ధన్ రెడ్డి మాజీ శాసనసభ సభ్యులుగా ఎనలేని కృషిని కుష్టు వ్యాధి గ్రస్తులకు వారు సేవా అందించారని గుర్తు చేసుకున్నారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం నీ స్థాపించి వ్యవసాయ అనుబం ధరం గంలో రైతులకు ఎన్నో సాంకేతిక విషయాలపై అవగాహన కలిగేలా పాటు పడ్డారని తెలిపారు. అదే విధంగా భూ సుపోషణ–సంరక్షణ దేశవ్యాప్త జన అభియాన్‌లో భాగంగా కే.వి.కేలో గోమాత– భూమాత – భారత మాత నినాదంతో భూమిపూజ గోవు పూజ నిర్వహించుకొని ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుం దని ని కావున రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలను ప్రకృతిని పరిరక్షించు కోవాలని రైతులకు సూచించారు. చివరగా ప్రకృతిని నేల పరిరక్షణ లో భాగంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి కేవికే ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్ గోపాల్ రెడ్డి కేవికే సీనియర్ సైంటిస్టు హెడ్ డా ఎన్ వెంకటేశ్వర్ రావు కేవికే శాస్త్రవేత్తలు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ విద్యార్థిని విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌పై పాలకులు పునరాలోచించాలి..

**ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత..**
**జేఏసీ నాయకుల దీక్షకు సంఘీభావం తెలిపిన ప్రొఫెసర్ కాసిం**



**జమ్మికుంట,మార్చి 30 (నినాదం)** హుజురాబాద్ సమీపంలో సిరసపల్లి దగ్గర ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తున్న జేఏసీ నిరా హార దీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏదైనా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రజావ్యతిరేక పనులను చేయకూడదని ఆయన తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ వరంగల్ కార్పొరేషన్ నుండి తీసుకువచ్చే చెత్తను హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల పంట పొలాలు నాశనం అవుతాయని త్రాగునీరు కలుషితమవు తుందని ఎన్నోగ్రామాలు అనారోగ్యం పాలు అయ్యే అవకాశాలు ఎక్కు వగా ఉన్నాయని ఆయన తెలిపారు. కరీంనగర్ వరంగల్ కార్పొరేషన్ లో టన్నులకు కొద్ది చెత్తను తీసుకువచ్చి జాతీయ రహదారి పక్కన హుజరాబాద్ గ్రామ సమీపాన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి ఇక్కడ అన్లోడ్ చేయడం మంచి పద్ధతి కాదని ప్రొఫెసర్ పేర్కొన్నారు. ఇప్పటికే జేఏసీ ఆధ్వర్యంలో వారు చేస్తున్న ఈ ఉద్యమానికి తన సంఘీభావం తెలుపుతున్నానని ఈవిషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. పాలకులు ఎవరైనా సరే ప్రజ లకు న్యాయం జరిగేలా చూడాలని వారి ఆకాంక్షను గుర్తించి వారు వ్యతిరేకిస్తున్న ఈ డంపింగ్‌యార్డ్‌ను ఇక్కడినుండి తరలించి మరొక చోట ఏర్పాటు చేసుకోవాలని అది ఏ సంస్థ అయినా సరే ప్రజలకు హాని తలపెట్టే విధంగా పనులు చేయకూడదని ఆయన సూచించారు. రెండు మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన చెత్తతోపాటు మరికొన్ని మున్సిపాలిటీల చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వరంగల్ కరీంనగర్ ప్రధాన రహదారి ప్రక్కన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల దానిలో నుండి వచ్చే వాసనతో పాటు దాన్ని కాల్చితే వచ్చే పొగ ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభు త్వం ఆచర్యను విరమించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ తో పాటు సిరిసపల్లి గ్రామస్తులు జేఏసీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**జమ్మికుంట, మార్చి 30 (నినాదం) :** అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి సీనియర్ నాయకులు కడియం శ్రీహరి పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జమ్మికుంట పట్టణంలోని స్థానిక గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మొదటి నుంచి దళితులపై చిన్న చూపు ఉన్నదని గతంలో కూడా ఎన్నోసార్లు అవమానించిన ఘటనలు ఉన్నాయని ఇప్పు డు కూడా దళిత బిడ్డ కడియం శ్రీహరిని కావాలనే హుజురా బాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం జరిగిందని, ప్రజల సానుభూతితో గెలిచిన నాయకుడు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కల్వకుంట్ల కుటుంబానికి బానిసగా మారారని ఎద్దేవా చేశారు. బే షరతుగా క్షమాపణలు చెప్పినట్లయితే రానున్న రోజుల్లో సురాబాదు నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్, మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, సాయిని రవి, గూడెపు సారంగపాణి, పూదరి రేణుక శివ, నాగేంద్ర, భాగ్యలక్ష్మి, రాము మొగిలి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 30మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**హుస్నాబాద్, మార్చి, 30 (నినాదం):** పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రజాపాలనలో భాగంగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను అందజేశారు. హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం లో సుమారు 14,47,000/- రూపాయల విలువ గల చెక్కులను మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి మరియు వైస్ చైర్మన్ చిత్తారి పద్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సాయం కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, ప్రజా సంక్షేమమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా గరుడ వాహన సేవ

.. ఆలయం చుట్టూ ఊరేగింపు



**జమ్మికుంట, మార్చి 30 (నినాదం):** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం రాత్రి గరుడవాహన సేవ నిర్వహించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సీతారామచంద్ర స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా పట్టు వస్త్రాలతో అలంకరించి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. వందలాది మంది భక్తుల రామనామ స్మరణ మధ్య దేవాల యం చుట్టూ గరుడ వాహనంపై ఉన్న సీతారాములను ఊరే గింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వంశీధరచార్యులు, ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఈవో సుధాకర్, ధర్మకర్తలు మర్రి రాంరెడ్డి, చిరంజీవి పరమేష్, కాసం నాగరాజు, శీను, ఆలయ సిబ్బంది, మోహన్, మల్లారెడ్డి, సురేందర్రావు ,రమేష్, ప్రవీణ్ ,తోపాటు భక్తులు పాల్గొన్నారు.

# 'పాడి'ఇంటిపై కోడిగుడ్లతో దాడి

**ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసిన యూత్ కాంగ్రెస్ నేతలు**



**జమ్మికుంట, మార్చి 30 (నినాదం):** అసెంబ్లీలో సీనియర్ నాయకులు మాజీ మంత్రి కడియం శ్రీహరి పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు హుజురాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై సోమవారం యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ మండలాధ్యక్షుడు పంజాల అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నేతలు కోడిగుడ్లు టమాటలతో దాడి నిర్వహించి ఎమ్మెల్యే దిష్టిబొ మ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు చల్లూరి రాహుల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశలలో దళిత శాసనసభ్యులు కడియం శ్రీహరి పైన మాట్లాడిన మాటలు వెనక్కు తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే హుజురాబాద్ నియోజకవర్గం లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వం రద్దు అయ్యేవరకు మా యూత్ కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రవణ్, అసెంబ్లీ ఉప అధ్యక్షులు బండ నవీన్, ప్రధాన కార్యదర్శి శనిగరపు తరుణ్, చిట్యాల రేవంత్, మండల ఉప అధ్యక్షులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణు వర్ధన్ ప్రధాన కార్యదర్శి పంజాల రాజు గౌడ్, నాయకులు ఎండీ సాధిక్, జన్ను ప్రసాద్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఈ- ఆఫీస్ ద్వారానే ఫైళ్లను నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి మార్చి 30 (నినాదం)**

ఏప్రిల్ ఒకటి నుండి ఈ– ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం ఈ– ఆఫీస్ ద్వారా ఫైళ్ళ నిర్వహణ విషయమై ఇదివరకే జిల్లా అధికారులు, వారి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ఏప్రిల్ 2 న గ్రామసభలు నిర్వహించాలని, అలాగే మున్సిపాలిటీలలో మున్సిపల్ వార్డు సభలు నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనల ప్రకారం గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని చెప్పారు. ఇదివరకు ఆదేశించినట్లు వివిధ పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్ది దారుల వివరాలను గ్రామసభలలో చదివి వినిపించాలని, గ్రామసభల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా ఫోటోలు, వీడియోలతో ప్రజెంటేషన్ ఇవ్వాలని, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశాల మినిట్స్‌ను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు.ప్రజా పాలన పరిధి లోకి రాని పథకాల ద్వారా లబ్ది పొందిన వారి వివరాలను ఉదాహరణకు వివిధ సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థులు పొందిన ఉపకార వేతనాల లబ్ధి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి, 6 గ్యారంటీ ల ద్వారా పొందిన లబ్ది అలాగే ధరణి కింద తిరుమలగిరి సాగర్ మండలాన్ని, భూభారతి కింద దేవరకొండ



మండలంలో తీసుకున్న పైలెట్ ప్రాజెక్టును, కనగల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద సోలార్ రూఫ్ టాప్ ద్వారా లబ్ది పొందుతున్న లబ్ధిదారుల వివరాలను సైతం ప్రజలకు తెలియజేయాలని, అందువల్ల గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా వారీగా రూపొందించి వెంటనే సిపిఓ కు సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఈ–వేస్ట్ నిర్వహణ వివరాలు ఇవ్వాలన్నారు. అనంతరం మార్కెటింగ్ శాఖ ద్వారా 2025 –2026రబీ ధాన్యం కొనుగోలుపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా ముస్లిం ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. 27 వ జాతీయ సీనియర్ చెవిటి క్రీడల ఛాంపియన్షిప్ పోటీలలో మెడల్స్ పొందిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి , చండూర్ ఆర్డిఓ శ్రీదేవి, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి ,జిల్లా అధికారులు హాజరయ్యారు.

# పోదాం... పద..!?

## కాంగ్రెస్‌తో కలిసి నడుద్దాం

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చెట్టా పట్టాల్

### హైదరాబాద్ కేంద్రంగా వ్యూహరచన

**జగిత్యాల ప్రతినిధి మార్చి 30 (నినాదం )**

జగిత్యాల నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీని పట్టాలెక్కించడం కోసం కేటీఆర్ వ్యూహాత్మక రచన చేస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ కనుసనల్లో జగిత్యాల టిఆర్ఎస్ కు పూర్వవైభవం తీసుకురావడం కోసం జీవన్ రెడ్డి తోడయ్యారని భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్టుబట్టి డాక్టర్ సంజయ్ కుమార్ కు రాజకీయ బిక్ష పెట్టారు. మొదటిసారి ఓటమి పాలైన సంజయ్ కుమార్ ను కెసిఆర్ దూరం పెట్టిన కవిత ప్రోద్బలంతో పార్టీ లైన్లోకి తెచ్చి అసెంబ్లీ మెట్లు ఎక్కించారు. కనీస కృతజ్ఞతా భావం లేకుండా పార్టీ ఫిరాయించి జగిత్యాల నియోజకవర్గం లో రాజకీయ అస్థిరత సృష్టించారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేని అంటూ గాంధీభవన్లో సమావేశాలు హాజరవుతున్నారు. ఈ వికృతి రాజకీయ చర్యను నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా వ్యతిరేకించారు. ఈ దుశ్చర్యను భరించలేక జీవన్ రెడ్డి రాజీనామా చేశారు. బిఆర్ఎస్ క్యాడర్ కాంగ్రెస్ తో కలిసి పని చేయాలో ఎమ్మెల్యే వెంబడి ఉండాలో భవిష్యత్తు ఏంటో తెలియక ఇప్పటికీ డైలమాలోనే ఉన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించడంతో ఆ స్థానాన్ని ఎమ్మెల్సీ రమణ భర్తీ చేస్తాడని పార్టీ అధిష్టానం కోరుకుంది. జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నియోజకవర్గ ఇన్చార్జి దావసంతలను కలుపుకొని పార్టీ క్యాడర్ చెక్కుచెదరకుండా కాపాడుతారని ఆశించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యూహరచనలో ఎమ్మెల్సీ రమణ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లు పాత్రధారులుగా మారి తమ రాజకీయ జీవితాలను ప్రశ్నార్థకం చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల కోసం పంపించిన ఫండ్



పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేయడంతో పాటు బి ఆర్ఎస్ కౌన్సిలర్ల ఓటమి కారకులయ్యారని కేటీఆర్ కు ఫిర్యాదు చేశారు. పార్టీ ఫండ్ విషయంలో జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు కు ఎమ్మెల్సీ రమణకు మధ్య వాగ్వివాదం జరిగినట్లు కూడా పార్టీలో తీవ్ర చర్చ నడిచింది. ఎమ్మెల్సీ రమణ ఎమ్మెల్యే సంజయ్ కుమార్లు వ్యూహాత్మకంగానే మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ను దెబ్బ కొట్టారని ఓటమిపాలైన కౌన్సిలర్ అభ్యర్థులు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. గత సంవత్సర కాలం నుంచి ఎమ్మెల్సీ రమణ సీఎం రేవంత్ రెడ్డి అనుంగులకు టచ్ లో ఉండి తమ కుమారుడి బెర్త్ కన్ఫర్మేషన్ కోసం తీవ్ర ప్రయత్నాలు సాగించడంలో సఫలీకృతులయ్యారని సెక్రటేరియట్ వర్గాలు చెబుతున్నాయి . బి ఆర్ఎస్ పార్టీలోనే ఎమ్మెల్సీగా కొనసాగుతూ కాంగ్రెస్ కౌన్సిలర్ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేసిన ఎల్ రమణకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి హామీ ఇచ్చినట్లు బయట ప్రచారం జరుగుతుంది. జగిత్యాల నియోజకవర్గం లో పిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్సీ రమణలు కలిసి ప్రోగ్రాం లకు హాజరు కావడం విశేషం. . నియోజకవర్గంలో బి ఆర్ఎస్ క్యాడర్ను పూర్తిగా కాంగ్రెస్ పార్టీ వైపు డైవర్ట్ చేసే క్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావసంత అడ్డు తగులుతూ వచ్చారు. ఎమ్మెల్సీ హోదాలో ఉన్న ఎర్రమున కూడా వసంతను కొంతవరకు నిల్వనింపజేసి పార్టీకి అర్థం చేశారనే విమర్శలు ఉన్నాయి .. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్సీ రమణలు అనేకసార్లు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పార్టీ ఫిరాయించి

> పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేని గెలిపించాం. కౌన్సిలర్ గా అవకాశం రావడంతో పోటీలో నిలబడితే పార్టీ సపోర్ట్ చేయకపోగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ మాకు అన్యాయం చేశారు. పొద్దంతా ఇంటి ముందు నిలబెట్టుకుని లక్ష రూపాయలు ఇచ్చి పార్టీ ఒక్క రూపాయి కూడా పంపలేదని ఓట్లు పెట్టుకొని పరోక్షంగా దెబ్బతీశారు.
>
> **అనిత గణేష్.. బి ఆర్ ఎస్, కౌన్సిలర్ అభ్యర్థి రాయికల్**

బిఆర్ఎస్ పార్టీ పతనానికి కారణమైన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో ఎల్.రమణకు ఏం పని....? వీరిద్దరి కలిసి ఏకకాలంలో సీఎం రేవంత్ రెడ్డిని కలవడంతో పాటు ఆయన కుమారుని రేవంత్ రెడ్డికి పరిచయం చేయడంలో ఆంతర్యం ఏమిటి..? టిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు పంపిన ఫండ్ ఎందుకు పూర్తిస్థాయిలో ఖర్చుపెట్టలేకపోయారనేది మరో ప్రశ్న వీటన్నింటికీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్సీ రమణలు కలిసికట్టుగా టిఆర్ఎస్ పార్టీని నియోజకవర్గంలో పతనావస్థకు చేర్చి సీఎం రేవంత్ రెడ్డి ద్వారా లబ్ది పొందే రాజకీయ వ్యూహంలో భాగమైననే ప్రచారం కూడా ఉంది. రానున్న రోజుల్లో ఎమ్మెల్సీ రమణ ను టిఆర్ఎస్ పార్టీ ఇ భరిస్తుందా.? చెలియా సారధ్యాన్ని కొనసాగిస్తుందా..? దావసంతం ఎప్పటికప్పుడు నిల్వదింపజేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను ఎమ్మెల్సీ రమణ ఎందుకు సపోర్ట్ చేస్తున్నారు ఇవి తేడాల్సిన అంశాలకు ఫుల్ స్టాప్ పెడుతూ జీవన్ రెడ్డి చేరికతో సరి చేయనున్నట్లు అవగతం అవుతుంది.





## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

### జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం



**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 30 (నినాదం):**

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (143) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### ఫిర్యాదులపై పోలీసు అధికారులు

## తక్షణమే స్పందించాలి

### జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి,మార్చి 30 (నినాదం)**

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై పోలీసు అధికారులు సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డిఆదేశించారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి 9 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు అందించారు. ప్రతి ఫిర్యాదుపై ఎస్పీ స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు తక్షణమే ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ



చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేటి ప్రజావాణిలో వచ్చిన 9 ఫిర్యాదుల్లో 4 భార్య భర్తల ఫిర్యాదులు, 1 భూతగాదాల ఫిర్యాదు, 4 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయని ఎస్పీ వివరించారు

## రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'



### చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర–2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు.

NINADAM CINEMA



### ఆడపులిలా

## మారాను అనిపిస్తోంది

### కియారా అడ్వాణీ

అమ్మనయ్యాక తను జీవితాన్ని చూసే విధానమే మారిపోయిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక కియారా అడ్వాణీ. హీరోలకు దీటుగా యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టే నాయికీమె. ప్రస్తుతం మాతృత్వ దశను ఆస్వాదిస్తున్న కియారా.. తల్లయిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ''ఇప్పుడు నేను ఆడపులిలా మారానని అనిపిస్తోంది. మునుపటి కంటే నా జీవితాన్ని చూసే కోణం భిన్నంగా ఉంది. ఒక్కోసారి మరేదీ ముఖ్యం కానట్టు అనిపిస్తుంది. కొన్ని సమయాల్లో ప్రతి చిన్న విషయం కూడా ముఖ్యమనే భావన కలుగుతుంది'' అని అంది. పెళ్లి తర్వాత తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో తన బంధం గురించి మాట్లాడుతూ.. ''పెళ్లికి ముందు మా మధ్య ఉన్న సరదా కబుర్లు, కలిసి ప్రయాణాలు చేయడం ఇవేమీ మారలేదు. ఇప్పటికీ మేమిద్దరం కలిసి సినిమాలు చూస్తాం. నటీనటులుగా, సినిమా ప్రేమికులుగా ఆ చిత్రాల గురించి చర్చించుకోవడం మాకు చాలా ఇష్టమ''ని చెప్పుకొచ్చింది. ''నాకు ఎప్పుడూ నటిని అవ్వాలని ఉండేది. చిన్నప్పుడే నాలో ఆ కోరిక ఉందని మా తల్లిదండ్రులు పసిగట్టారు. కానీ ముందుగా చదువు పూర్తి చేయాలని పట్టుబట్టారు. ఆ తర్వాత వారి ప్రోత్సాహంతోనే చిత్రపరిశ్రమలోకి వచ్చాను. వైఫల్యమే ఉత్తమ గురువు అని తెలుసుకున్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. కథలు, పాత్రలతో కనెక్ట్ అయితే.. అంతకు మించి ఆలోచించను. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాను. నేను దర్శకుడి నటిని. దర్శకుడికి, నటులకి మధ్య ఉండే అనుబంధమే ముఖ్యమని నమ్ముతాను''.

### చిరుతో మరోమారు

## బాబీ సినిమా

మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్టు రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ–ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.






## సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

చాలా కాలంగా సరైన బ్రేక కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుకలో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితో పాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్టు పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్టు ఇద్దరికీ కీలకంగా మారింది.



## ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం

### సంతాపం ప్రకటించిన పవన్

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787